నెల రోజులపాటు ఎంతో ఆర్భాటంగా జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి. ఈ మాసంలో ప్రతి రోజూ మన సంప్రదాయాలను గుర్తు చేస్తూ హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల గెంతులు ఆకట్టుకునేవి. ఇక జంగమదేవరలు, కాటికాపర్ల వేషధారణ చూసి ఒళ్లు గగుర్పుడిచేవి. కానీ ఇప్పుడు వీరంతా కనుమరుగయ్యారు. పల్లెల్లో ఆదరణ తగ్గడం.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ వృత్తుల్లో స్థిరపడిపోయారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



● కాటికాపర్లు ఏరీ!?

ఒంటిపై పంచె, నల్లని చొక్కా, తల మీద ఇత్తడి కిరీటం, నుదుటున ఎర్రని పెద్ద బొట్టు, బొర్ర మీసాలు, జు ట్టు పెంచుకుని, కళ్లకు కాటుక, మెడ లో పెద్ద రుద్రాక్ష దండలు, చిన్న చిన్న గంటలు, సంకలో జోలె, అందులో ఎముకలు, బొమ్మలు, పూసలు, ఇతర సామగ్రి, చేతిలో పెద్ద గంట, గవ్వలు, తాళ్లపత్ర గ్రంథం, వీపున జంతు చర్మంతో భీతిగొలిపేలా గాంభీరమైన వస్త్రాధారణ. వీరినే కాటికాపరులు అంటారు. నాడు పల్లెల్లో భిక్షాటన చేస్తూ కనిపించేవారు. నిరాశి అనే పేరుతో ఒకరి ప్రాంతంలో మరొకరు వెళ్లకుండా కట్టుబాట్లు ఉండేవి. సంక్రాంతికి నెలరోజుల ముందు నుంచి పండుగ ముగిసే వరకు తమ పరిధిలోని ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి ధాన్యం, పప్పులు, బట్టలు, వస్త్రాలు, నగదు, పిండి వంటలు తీసుకునేవారు. అయితే, వీరిపై పల్లెల్లో ఆదరణ తగ్గిపోవడంతో అంతా ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. సంచార జీవులుగా ఉన్నవీరంతా ఇప్పుడు ఎక్కడెక్కడో స్థిరపడి పోయారు.

పండుగ అతిథులు.. అదృశ్యం


- కానరాని డూడూ బసవన్నలు, జంగమ దేవర్లు
- కాటికాపరి, హరిదాసులదీ అదేదారి
- ఆదరణ లేక ప్రత్యామ్నాయ ఉపాధి వైపు అడుగులు



ఒంటినిండా నల్లటి దుస్తులు.. తలకు పాగా.. నుదుటున విబూదితో నామాలు... ఒకచేతిలో గంట.. మరోచేతిలో శంఖు, బుజాన కావడి లేదా జోలే పట్టి శివ స్తుతి చేస్తూ గంట వాయిస్తూ, మధ్య మధ్యలో శంఖాన్ని ఊదుతూ ప్రతి ఇంటి ముందు జంగమదేవరలు ఆగుపించేవారు. బియ్యం లేదా నగదు, ఇతర వస్తువులు ఇస్తే స్వీకరించే వెళ్లేవారు. కానీ ఇప్పుడు వీరంతా కనుమరుగయ్యారు. సమాజంలో వచ్చిన మార్పులతో జంగమ దేవర ఇళ్లలోని పిల్లలు చదువుకుని ఉద్యోగాలు, వ్యవసాయం వంటి ఇతర వృత్తుల్లో స్థిరపడిపోయారు. ఒకప్పుడు సంగం మండలంలోని చెన్నవరపాడులో గ్రామమంతా జంగం కులస్థులే ఉండేవారు. 20 ఏళ్ల కిందట సంక్రాంతి నెల వచ్చిందంటే వీరంతా ఉత్తరాది జిల్లాలకు వెళ్లి అక్కడ జంగమ దేవర వేషధారణలో పల్లెల్లో తిరిగి నాలుగు రూపాయలు సంపాదించి పండుగ తర్వాత తిరిగి సొంతూరికి వచ్చేవాళ్లు. ఇప్పుడు ఆ గ్రామంలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఆ వృత్తిలో లేరు. అంతా గౌరవప్రదమైన వృత్తిలో ఉంటున్నారు.

● కానరాని డూడూ బసవన్నలు

'అమ్మగారికి దండం పెట్టు, అయ్యగారికి సలాం కొట్టు..' అంటూ పల్లెలో డూడూ బసవన్నల (గంగిరెద్దులు) సందడి కనిపించేది. వీటి వెంటే వీధుల్లో పిల్లలు గుమికూడి అల్లరి చేసేవారు. కానీ ఇప్పుడు గంగిరెద్దులు కనిపించడం లేదు. అక్కడక్కడా ఉన్నా నాటి సందడి లేనేలేదు. వృత్తి గిట్టుబాటుకాక చాలా మంది ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్లిపోయారు. కొత్తగా ఈ వృత్తిని స్వీకరిస్తున్నవారూ లేరు.



నాటి సంక్రాంతి రోజులే వేరు

మా రోజుల్లో పెద్దపండుగ (సంక్రాంతి) నెల వచ్చిందంటే ఒకటే సందడి. ఎవరి ఇంటిలో చూసినా హడావుడి ఉండేది. ఆడోళ్లంతా ఇంటిని చక్కదిద్దే పనిలో పడేవారు, మగవారు పొలం పనులతో బిజీగా గడిపేవారు. పూరిపాకల గోడలకు పేడ దిద్ది సున్నం వేసి, ఎర్రమట్టి చారలతో సుందరంగా అలంకరించేవారు. పెద్ద కుటుంబాలైతే భవంతులకు సున్నాలు వేసేవారు. కానీ ఇప్పుడు కార్యాలయితే తప్ప సంక్రాంతిని పండగలా చూడటంలేదు. పల్లెల్లో కూడా చూద్దామన్నా ఇంటికి రంగులేసేవారు కనిపించడంలేదు.

- చలమయ్య, అన్నారెడ్డి పాలెంవాసి

● హరిదాసులదీ అదేదారి

తెల్లవారుజామునే ప్రతి ఇంటి ముందు పాటలు పాడుతూ హరిదాసులు కనిపించేవారు. బియ్యం, నగదును హరిదాసుల తలపై ఉన్న పాత్రలో వేసేవారు. నేడు ఎక్కడా హరిదాసులుగాని, కీర్తనలుగాని వినిపించడంలేదు. కొత్తగా హరిదాసు వేషధారణ వేసి పల్లెలకు వచ్చేవారూ లేరు. ఒకరిద్దరు ఉన్నా వయసు పైబడటంతో ఇంటివద్దనే ఉంటున్నారు.

నిప్పట్ల ఘుమఘుమలు

- ఏ ఇంట చూసినా పిండి వంటలే
- పట్టణాల్లో 'రెడీమేడ్'

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ చూసినా సంక్రాంతి పిండివంటల ఘుమఘుమలే!. పెద్ద పండుగ సంప్రదాయాలకే కాదు పిండి వంటలకూ ప్రసిద్ధి. అందుకనే ఏ ఇంటికి వెళ్లినా పిండి వంటల సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా పల్లెల్లో నిప్పట్లు అని పిలుచుకునే అరిసెలు సంక్రాంతికే స్పెషల్. ఇవి ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. అందుకని పిండి వంటల్లో ఇవి ఉండి తీరాల్సిందే. బెల్లం అరిసెలతోపాటు చక్కెర అరిసెలు, నేతి అరిసెలు కూడా చేస్తున్నారు. ఎక్కువ మంది సభ్యులున్న కుటుంబాల్లో అందరూ కలిసి తీరిక చేసుకుని పిండి వంటలు తయారు చేస్తున్నారు. చిన్న కుటుంబాల వారైతే ఇద్దరు ముగ్గురు కలిసి రకరకాల పిండి వంటలు చేసుకుంటున్నారు. నిప్పట్ల తర్వాత మణుగుబూలు, చెక్కలు, కజ్జికాయలు, లడ్డూలను ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. ఇక, పట్టణాల్లో ఉరుకులు పరుగుల జీవితాల్లో టిఫిన్లు, భోజనాల్లాగే సంక్రాంతి పిండి వంటలను కూడా రెడీమేడ్‌గా తెచ్చేసుకుంటున్నారు. వీరి కోసమే అన్నట్లు ఆర్డర్లపై పిండి వంటలను పలు హోటళ్లు, మెస్‌లు, స్వీట్ స్టాళ్లు, క్యాటరింగ్ పాయింట్ల వారు రుచికరంగా అందిస్తున్నారు. కొన్ని చిన్న కుటుంబాలు స్వయం ఉపాధి కోసం ఆర్డర్లపై పిండివంటలు చేసిస్తున్నాయి. ఇలా వెళ్లి... అలా తెచ్చుకుని పండుగ చేసేసుకోవడమే!.



ఉదయగిరిలో పిండివంటలు చేస్తున్న ఓ కుటుంబం

భోగిళ్లో.. భోగిళ్లు

తెలుగువారి పెద్ద పండుగ వచ్చేసింది. ఏడాది పొడవునా ఎన్ని పండుగలు వచ్చినా సంక్రాంతికి సాటి రాదేది. అందుకే ఇది మనందరి పే...ద్ద పండుగ. ఇందులోనే పెద్దల పండుగ కూడా!. భోగితో మొదలై సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పారువేట, ఏటి పండుగలతో జిల్లాలో ఐదురోజులు సందడే సందడి. చదువు, ఉద్యోగం, వ్యాపారం కోసం దేశ విదేశాల్లో ఉన్నవారంతా ఒక్కచోటికి చేరే సమయం. సామాన్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరూ పెద్ద పండుగను సొంత ఊళ్లో జరుపుకోవాలనుకుంటారు. అందుకనే పట్టణాల్లో బతుకుతున్న వారంతా పల్లె బాట పట్టారు. రోడ్లపై వాహన ప్రవాహం కనిపిస్తోంది. ఏ బస్సు చూసినా, ఏ రైలెక్కినా కిటకిటే!. అయినా అదోక కమ్మని అనుభూతి. పుట్టిపెరిగిన ఊరికి వెళుతున్నాం... ఆత్మీయులతో పండుగ జరుపుకోబోతున్నామనే ఆనందం. ఇక, సంక్రాంతి ప్రత్యేకం పిండి వంటలు. ఏ ఇంటి ముంధు నుంచి వెళుతున్నా అరిసెలు, కజ్జికాయలు, మణుగుబూల గుబాళింపే. కొత్త అల్లుళ్లు అత్తగారిళ్లకు చేరి సందడి చేస్తున్నారు. ఆడపిల్ల లు అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా పావడా పరికిణీ, లంగావోణీల్లో ఇళ్లకు కొత్త కళ తెస్తున్నారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు... వెరసి సంక్రాంతికి జిల్లా సిద్ధమైంది.




నెల్లూరు : టీడీపీ కార్యాలయం ముందు వేసిన భోగి మంట

- నేడు భోగభాగ్యాల భోగి
- సంక్రాంతి సంబరాలు ఆరంభం
- జిల్లాలో ఐదు రోజులు సందడి
- పల్లెలకు కదిలిన పట్టణాలు

సంక్రాంతి సంబరాల్లో తొలిరోజు భోగి పండుగ. ఇళ్ల ముంగిట మంటలు వేసి చిన్నా పెద్దా సందడి చేసే వేడుక. భోగ భాగ్యాలను ఇచ్చే పండుగగా దీనిని జరుపుకుంటారు. ఈ పండుగ రోజు ధనుర్మాసం ముగుస్తుంది. దీంతో ఆలయాల్లో భోగి కల్యాణాలు నిర్వహి స్తారు. పసిపిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వ దిస్తారు. భోగి మం టల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల కాలుష్యం పెరిగి వాతావరణం కలుషితమవుతుంది. పర్యావరణానికి ఉపయోగపడే పిడకలు, కలపను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. భోగి పండుగ సందర్భంగా కొన్ని కుటుంబాలు గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి గొబ్బి నోము నోచి ఏటి పండుగ రోజు నదీజలాల్లో ఓలలాడిస్తాయి. మరికొందరు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి గౌరీ దేవివి పూజించి రాత్రివేళ పేరంటాళ్లకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు అందుకుంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయి. అయితే ఈ పండుగకు నిత్యావసర సరుకుల ధరలు గత ఏడాది కంటే 20 శాతం పెరిగాయి. వంట నూనెలు పిండి వంటలు చేయకుండానే కాగుతున్నాయి. ఇక, భోగికి అవసరమైన తాటి ఆకులు, తేగల ధరలు కూడా భగ్గుమంటున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : కొనుగోలుదారులతో కిక్కిరిసిన ట్రంకురోడ్డు

కోడిపందేల జోరు

- సిఫారసుల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్!

ఉదయగిరి రూరల్ : మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో కోడిపందేల నిర్వహణకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొంతమంది సిఫారసుల కోసం రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదయగిరి మండలంలోని దుంపవారిపల్లి, గుడినరవ, జీ.చెరువుపల్లి తదితర గ్రామాల్లో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే వరికుంటపాడు మండలం నల్లబోతులవారిపల్లి,



తూర్పురొంపిదొడ్ల, కాంచెరువు, తూర్పుబోయమడగల, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుపాళెం, సీతారామపురం మండలం బసినేనిపల్లి, పబ్బులేటిపల్లి, గుండుపల్లి, చిన్నాగంపల్లి, సీతారామపురం, సింగారెడ్డిపల్లి, వింజమూరు మండలంలోని కాటేపల్లి, రావిపాడు, కోకావారిపాళెం, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో పందేలు కొనసాగే అవకాశం ఉంది. పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా నిర్వాహకులు మాత్రం డోంట్ కేర్ అంటూ తమ పంతాన్ని నెగ్గించుకొనేందుకు తమదైన శైలిలో పావులు కదులుపుతున్నారు.

● ఆత్మకూరు, : ఆత్మకూరు సర్కిల్ పరిధిలో కోడిపందేల నిర్వాహకులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీచేశారు. జూదగాళ్ల జాబితాను సిద్ధంచేసి వారిపై నిఘా పెట్టడంతోపాటు గతంలో గుర్తించిన కోడి పందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదుకూ వెనకాడబోమని స్పష్టం చేశారు. అలాగే పలు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.



ఉదయగిరి : నిర్మానుష్యంగా ఉన్న గంగిరెడ్డిపల్లి ప్రధానవీధి

పల్లెకేదీ.. పండగ

ఉదయగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందడి అంతా పల్లెలదే. బంధు మిత్రులతో ఎంతో ఉల్లాసంగా జరుపుకునే పండుగ ఈసారి గ్రామాల్లో బోసిపోయింది. జిల్లాలోని మెట్ట ప్రాంత పల్లెల్లో సంక్రాంతి కళ కనిపించడం లేదు. మూడేళ్లుగా వరుణుడు వర్షించక పోవడం, మోటార్లు, బావుల కింద సాగు చేసిన పంటలు దెబ్బతినడం, పంట చేతికొచ్చినా ధర లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. మరోవైపు సేద్యపు ఖర్చులు పెరగడంతో సిరులు పండే భూముల్లో చిల్లచెట్లు దర్శనమిస్తున్నాయి. ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేతపట్టుకొని పొరుగూళ్లకు వెళ్లిపోయారు. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి అధిక శాతం మంది బెంగళూరు, చెన్నై, పూణే, గోవా, మహారాష్ట్ర, హైదరాబాదు, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. కొన్ని పల్లెల్లో వృద్ధులు మాత్రమే మిగిలారు. పెద్ద పండక్కి అయినా ఆత్మీయులు వస్తారని గంపెడాశతో ఉన్న వారికి నిరాశే మిగిలింది. రానుపోను చార్జీలు, పండగ ఖర్చులు ఇలా ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాలేకపోతున్నట్లు వారు చెప్పడంతో లోలోన కుమిలిపోతున్నారు. దీంతో పల్లెల్లో పండగ సందడే కరువైంది.



వెంకట్రావుపల్లిలో వృద్ధులే దిక్కు

పండగ కళే లేదయ్యా!



ఏందో అయ్యా. ఈసారి మా ఊళ్లో పండుగ కళే లేదు. పని కోసం వెళ్లినవారంతా పండక్కి రావడం లేదని చెప్పారు. చార్జీలు, ఖర్చులు బాగా పెరిగిపోయాయి. రానుపోను దాదాపు రూ.10వేల దాకా ఖర్చవతాది. అందుకే రామని చెప్పేశారు. ఈ పండక్కి ఊళ్లో ఉన్నవారితోనే గడుపుకోవాల్సి వస్తోంది.

- కమలకూరి కృష్ణారెడ్డి, గంగిరెడ్డిపల్లి

పిల్లల్లేకుండా పండగేందినాయన!



అరకొరగా ఉన్న భూమి సక్రమంగా పండక, ఉన్న ఊరిలో ఉపాధి కరువై నా ముగ్గురు కుమారులు బేల్దారి, ఇతరత్రా పనుల కోసం బెంగళూరు వెళ్లారు. అక్కడ కూడా పని సరిగ్గా లేదట. పండక్కి ఊరికి వచ్చేందుకు కూడా చేతిలో డబ్బుల్లేక అక్కడే ఉండిపోయారు. పిల్లల్లేకుండా పండగ ఏం చేసుకోవాలయ్యా. అనారోగ్యంతో బాధపడుతున్న నా భర్త, నేను ఏం పండుగ చేసుకుంటాం చెప్పూ.

- బొందికాళ్ల చెంచమ్మ, వెంకట్రావుపల్లి

పోలీసులకు 'సంక్రాంతి కానుక'

● రూ.7.93 కోట్ల బకాయిల చెల్లింపునకు ఆదేశాలు

నెల్లూరు(క్రైం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగకు తీపి కబురు వినిపించింది. గత ప్రభుత్వ పాలన నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలకు వెంటనే నిధులు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 2,162 మందికి సరెండర్ లీవ్ బిల్లు బకాయిల కింద రూ.7.93 కోట్ల నగదు విడుదల కానుంది. దీంతోపాటు జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు విడుదల అవుతాయి. ప్రభుత్వ ప్రకటనతో పోలీసు కుటుంబాల్లో ఆనందం నిండింది. రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

నకిలీ సిగరెట్ల గుట్టు.. రట్టు

- ఉత్తరాది నుంచి దిగుమతి
- చెన్నై కేంద్రంగా వ్యాపారం
- విజిలెన్స్ బృందాల దాడి
- రూ.2.21 కోట్ల సరుకు స్వాధీనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/కోవూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ సిగరెట్ల గుట్టును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరం రామలింగాపురంలోని ఓ గోదాము, ఇనుమడుగులోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో దాడులు చేశారు. రూ.2.21 కోట్లకుపైగా విలువ చేసే సరుకును స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నైకు చెందిన కమల్ తివారి సిగిరెట్ల వ్యాపారి. నెల్లూరు బాలాజీ నగర్‌కు చెందిన జగదీష్ ఆయన వద్ద మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కమల్ తివారి బిహార్‌తోపాటు ఉత్తరాది రాష్ట్రాలనుంచి వివిధ ట్రాన్స్‌పోర్టుల ద్వారా ప్రముఖ బ్రాండ్లను పోలి ఉండే నకిలీ సిగిరెట్లను నెల్లూరుకు దిగుమతి చేస్తున్నారు. మేనేజర్ జగదీష్ వాటి ని జిల్లాలోని బడ్డీకొట్లు, సిగిరెట్ల విక్రయ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందడంతో వారి ఆదేశాల మేరకు నెల్లూరు విజిలెన్స్ ఎస్పీ రాజేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు నరసింహారావు, సుభాన్, డీసీటీవో విష్ణురావు, సిబ్బంది ఆదివారం రామలింగాపురంలోని గోదాము, ఇనుమడుగులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో దాడులు చేశారు. రామలింగాపురంలోని గోదాములో రూ.1,73,59,000 కోట్ల విలువ చేసే రాయల్స్, జీటీపీఎల్, విమల్, గోల్డ్‌స్టాగ్, ప్లాటినమ్, ప్యారీస్‌తో పాటు పలు కంపెనీల పేర్లతో ఉన్న 3,31,100 సిగిరెట్ పెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. ఇనుమడుగులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో రూ.47.52 లక్షల విలువ చేసే 1,18,800 సిగిరెట్ పెట్టెలను స్వాధీనం చేసుకుని మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సరుకును, మేనేజర్‌ను తదుపరి దర్యాప్తు నిమిత్తం బాలాజీ నగర్ పోలీసులకు అప్పగించారు.



నకిలీ సిగరెట్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు



నెల్లూరు రామలింగాపురంలో పట్టుకున్న నకిలీ సిగరెట్లు



ఇనమడుగులో సిగరెట్ల బాక్సులను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

రెడ్‌క్రాస్ సభ్యులకు కలెక్టర్ నోటీసులు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీలో రాజకీయ పార్టీలకు సంబంధమున్న పలువురికి కలెక్టర్ ఆనంద్ ఆదివారం నోటీసులు జారీ చేశారు. నిబంధనల అతిక్రమణపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా తదనంతరం చర్యలు ఉంటాయని తెలిపారు. కాగా, ఇప్పటికే రెడ్‌క్రాస్ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి రాజీనామా చేయగా, మరికొంత మంది సభ్యులు రాజకీయ పార్టీల్లో ఉన్నట్లు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ నోటీసుల జారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

సోమశిలలో 70.720 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 2,276 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు ఇంజనీర్లు తెలిపారు. దీంతో జలాశయంలో 70.720 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు. ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, తెలుగు గంగ వరద కాలువకు 200, పెన్నా డెల్టాకు 2,650 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.



మగువల సంక్రాంతి సంబరాలు

ఆటవిడుపు కోసమే... : పొంగూరు రమాదేవి

నెల్లూరు (వైద్యం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో మహిళల సంక్రాంతి క్రీడా పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. మహిళా శక్తి టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 450 మంది మహిళలు పాల్గొన్నారు. పరుగు, కుర్చీలాట, కబడ్డీ వంటివి నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకురాళ్లు కూడా పాల్గొని అందరినీ అలరించారు. హరిదాసులు, గంగిరెద్దుల ప్రదర్శన ఆకట్టుకుంది. పిల్లలకు భోగిపండ్లు పోశారు. మహిళలు కోలాటం ఆడి, భోగి మంట వెలిగించి సందడి చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పనివత్తిడిలో సతమతమవుతున్న మహిళలకు ఈ ఆటల పోటీలు ఎంతో ఆటవిడుపుగా ఉంటాయన్నారు. ఆటలు మానసికోల్లాసంతోపాటు ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరు పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, రేవతి, విజయ, శ్రీలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుడికి స్వర్ణ నేత్రాలు, తిరునామం బహూకరణ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామికి దాత అల్లూరి మహేష్‌రెడ్డి కుటుంబం ఆదివారం బంగారు తిరునామం, బంగారు నేత్రాలను బహూకరించింది. 287 గ్రాముల బంగారంతో వీటిని తయారు చేయించి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డికి అందజేశారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో భోగి వేడుకలు



టీడీపీ జిల్లా కార్యాలయంలో భోగి మంట వేస్తున్న చేజెర్ల, పాల్గొన్న నేతలు

నెల్లూరు (వైద్యం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ముందస్తు భోగి వేడుకలు జరిగాయి. పార్టీ నాయకులతో కలసి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర్లు రెడ్డి భోగి మంటలు వేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి తర్వాత వచ్చిన ఈ సంక్రాంతి ప్రతి కుటుంబంలో సంతోషం నింపాలన్నారు. రైతులకు పంటలు బాగా పండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దరిశి హరికృష్ణ, ఊరందూరు సురేంద్రబాబు, జ్ఞానేంద్ర, మురళి, ఉయ్యాల నరేంద్ర, పత్తిపాటి వెంగయ్య నాయుడు, గంగినేను రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్..!

పొదలకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, నాణ్యమైన కరెంటు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చింది. ప్రస్తుతం విద్యుత్ బిల్లుల రీడింగ్ తీసుకునే ఏజెన్సీ సిబ్బంది ఇంటికి వచ్చి రీడింగ్ నమోదు చేసి బిల్లును అందజేస్తున్నారు. ఆ సమయంలో యజమాని ఇంట్లో లేక పోవడంతో సకాలంలో బిల్లు అందకపోవడంతో పాటు విద్యుత్ చౌర్యానికి పాల్పడే అవకాశం ఉంది. కొన్నిచోట్ల పలువురు సిబ్బంది డోర్‌లాక్ పేరుతో వినియోగదారులతో కలిసి బిల్లింగ్‌లో అవకతవకలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో అలాంటి మోసాలకు అడ్డుకట్ట పడినట్టేనని అధికారులు భావిస్తున్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు వీటిని అమరుస్తున్నారు. పొదలకూరు మండలంలో 1600 మీటర్లు అమర్చాల్సి ఉండగా ప్రస్తుతానికి 700 స్మార్ట్ మీటర్లను అమర్చినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. అలాగే సరఫరాపై స్పష్టత.. విద్యుత్ సంస్థలకు 100 శాతం బిల్లింగ్‌తోపాటు పంపిణీ సంస్థలు నష్టాల నుంచి గట్టెక్కేందుకు స్మార్ట్ మీటర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు..



- విద్యుత్ సంస్థలకు 100 శాతం బిల్లింగ్‌లతో పాటు పంపిణీ సంస్థలు నష్టాల నుంచి బయటపడడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.
- భవిష్యత్తులో ఈ మీటర్లను ప్రీపెయిడ్‌గా వినియోగించే అవకాశం ఉంటుంది. దీంతో నెల వారి విద్యుత్ ఎంత అవసరమో ఆ మేరకు ముందుగా రీచార్జ్ చేసుకోవచ్చు.
- విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవు. నాణ్యమైన సరఫరా ఉంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు బిల్లు ఎంత అయ్యిందో వినియోగదారుడు సులభంగా తెలుసుకోవచ్చు. దీంతో కరెంటు వృథా కాకుండా వినియోగంపై స్వీయనియంత్రణ చేసుకునే అవకాశం ఉంటుంది.
- స్పష్టంగా విద్యుత్ వినియోగాన్ని వినియోగదారులు ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు.

అమిత్ షా రాజీనామా చేసే వరకు పోరాటం

- మనుబోలులో కాంగ్రెస్ నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనుబోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేసేవరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం చేస్తూనే ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి గణేష్ యాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం మనుబోలులో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారీ నిరసన ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొనగా కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వైఎస్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ సాగింది. అంబేడ్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనవరి 3నుంచి 26 వరకు నిరసన ర్యాలీలను జైబాపూజీ, జైభీమ్, జై సమ్విధాన్ పేరుతో నిర్వహించాలని పార్టీ ఆదేశించిందన్నారు. పార్లమెంట్‌లో అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. రాజ్యాంగంపై రకరకాల దాడులు చేస్తున్నారని, రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలో ప్రధానిని ఎదుర్కొనే వ్యక్తి రాహుల్‌గాంధీ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలగురవం బాబు, సర్వేపల్లి ఇన్‌చార్జి బళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దనందుకు ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దనందుకు మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు నీలగిరి సంఘంలో రామ్మోహన్(50) కుటుంబం నివసిస్తోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. గతంలో ఆయన ఐటీసీ కంపెనీలో పనిచేశారు. అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటూ తండ్రి పెన్షన్‌తో జీవిస్తూ మద్యానికి బానిసయ్యారు. మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా ఆయనలో మార్పు రాలేదు. ఆదివారం కూడా ఇదే చెప్పడంతో మనస్థాపానికి గురైన రామ్మోహన్ ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. భార్య కామాక్షిబాయి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● బచ్చిలో ఉపాధ్యాయిని..

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక అంజనాద్రినగర్‌లోని ఓ ఉపాధ్యాయురాలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు... ఓజిలి మండలం పెద్దపరియలో టీచరుగా పని చేస్తున్న పొంగూరు నర్మద (32) బుచ్చి మండలం రెడ్డిపాళెంకు చెందిన శ్రీనివాసులురెడ్డి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాసులు రెడ్డి సాయంత్రం వచ్చేసరికి తలుపు గడియపెట్టి ఉంది. ఎంతసేపటికి గడియ తీయకపోవడంతో ఇంటి వెనుక కిటికీలోనుంచి చూడగా నర్మద ఉరికి వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టి మృతదేహాన్ని కిందకు దింపారు. మృతురాలి తమ్ముడు హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కాగా, శ్రీనివాసులురెడ్డి మరో మహిళతో వివాహేతర సంబంధం ఉండటంతో తరచూ దంపతుల మధ్య గొడవలు ఉన్నట్లు సమాచారం. టీచరు నర్మద మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7530
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ.96.10

కోడిపందేల స్థావరంపై దాడి

నెల్లూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పల్లెపాళెం వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు సీఐ వేణు తెలిపారు. మూడు కోళ్లు, 18 మంది జూదరులు, 21 సెల్ ఫోన్లు, రూ.13,300 నగదు, 6 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడిపందేలు, పేకాట నిర్వహణపై ప్రభుత్వం నిషేధం విధించిందని, ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పరిశ్రమ పెట్టు.. లాభాల 'పట్టు'

- పరిశ్రమల శాఖ చొరవతోనే సాధ్యం
- కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంపై ఆశలు
- నిరుద్యోగులకు ఉపాధి
- రైతులకు ప్రత్యామ్నాయ ఆర్థిక వనరు

అల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం పైనే ఆధారపడిన రైతులు ప్రత్యామ్నాయ ఆర్థిక వనరు కోసం ఎదురు చూస్తున్నారు. వారికి ఉపాధిమార్గంగా జిల్లాలో అక్కడక్కడా పట్టు పరిశ్రమలు వెలిశాయి. నిరుద్యోగులు, రైతులకు సెరీకల్చర్ అధికారులు అవగాహన కల్పించి, పట్టు పరిశ్రమ ఏర్పాటుకు సహకరించారు. కానీ ఇదంతా గతం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పట్టు పరిశ్రమ మరుగున పడింది. నేటి కూటమి ప్రభుత్వంలో ప్రోత్సాహం లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

● చాకీ పెంపకం ముఖ్యం

చాకీ పెంపకమంటే పట్టు పరిశ్రమలో మొదటి రెండు దశలను చాకీ అంటారు. ఈ స్థాయిలో సక్రమ పద్ధతుల్ని అవలంబించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో పట్టు ఉత్పత్తి నాణ్యత లేకుండా వస్తుంది. దీంతో నష్టాలు వస్తాయి. ఈ కారణంగా పట్టు పరిశ్రమలో చాకీ అనేది ప్రధాన ఘట్టంగా పరిగణించాలి. ఉష్ణోగ్రత, తేమ, పారిశుధ్యం, లేత మల్బరీ ఆకుల నాణ్యత, మంచి పెంపక వసతులు ప్రధాన అంశాలుగా పట్టుపరిశ్రమలో ప్రాధాన్యతను సంతరించుకుంటాయి.

● పాటించాల్సిన పద్ధతులు

పట్టుపరిశ్రమను స్థాపించాలంటే ముందుగా మల్బరీ తోటలను సాగు చేయాలి. మల్బరీ ఆకులపై ఏర్పాటయ్యే పట్టుపురుగుల గుడ్లను



పట్టుకు సహకరించేపురుగులు

సేకరించాలి. నెలకు రెండు దఫాలుగా పట్టు పురుగులను ఏర్పాటు చేసుకోవాలి. నాలుగు నుంచి ఐదు వేల పట్టుపురుగులు ఏర్పాటు చేసుకొని, వాటి ద్వారా పట్టును ఉత్పత్తి చేయాలి.



పట్టు పురుగులకు ఆహారంగా ఉపయోగించే మల్బరీ ఆకులు

● శిక్షణ ఉంటేనే విజయం

పట్టు పరిశ్రమను శాస్త్రీయంగా శిక్షణ పొందిన వారు చేపడితే విజయాన్ని సాధించవచ్చని నిపుణులు అంటున్నారు. మైసూరులోని సీఎస్ఆర్‌టీఐ సంస్థ పట్టు పరిశ్రమపై శిక్షణ ఇస్తున్నది. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుంది. శిక్షణ పొందిన వారు పెద్దపెద్ద పట్టు పరిశ్రమల్లో ప్రధాన బాధ్యతలు చేపడుతుంటారు. ఇలాంటి కేంద్రాలను రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.

● ప్రభుత్వం నుంచి సహకారం

సెరీకల్చర్‌శాఖ ద్వారా పట్టుపరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన సూచనలే కాకుండా, ప్రత్యేక రాయితీ రుణాలు ఉంటాయని ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పట్టు పరిశ్రమ ఏర్పాటు చేసిన రైతుకు అన్ని విధాలా సహకారం అందిస్తూ మార్కెటింగ్ చేసేంత వరకు వారి సూచనలు ఉంటాయి. అదేకాకుండా పట్టుకు ఉండే గిరాకీ కారణంగా ఏ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేసినా సమాచారం అందిస్తేచాలు మార్కెటింగ్ చేసేవారు వచ్చి సంప్రదించే అవకాశం ఉంది.

శిక్షణ కేంద్రాలను అందుబాటులో ఉంచాలి



పట్టుపరిశ్రమలో చాకీ పద్ధతిపై శిక్షణ పొందేందుకు అవసరమైన కేంద్రాలను అందుబాటులో ఉంచాలి. యువతకు అందుబాటులో ఉండేలా చేస్తే శిక్షణ పొంది పరిశ్రమను స్థాపించేందుకు వీలుంటుంది.

- దాసరి ప్రభాకర్, నార్తుఆములూరు

మా ప్రాంతం అనువైనది



మెట్టప్రాంతమైన నార్తుఆములూరు, బట్రకాగొల్లు గ్రామాల్లో పట్టు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉంది. దీనిపై సమగ్ర సమాచారాన్ని అందించి యువతను ప్రోత్సహిస్తే వారికి స్వయంగా ఉపాధి లభిస్తుంది. ఈ దిశగా సెరీకల్చర్ అధికారులు ముందుకు రావాలి.

- గుంజి రుద్రయ్య, మాజీ సర్పంచి, నార్తుఆములూరు

సకల శుభాలు కలగాలి

- మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను రాష్ట్ర ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రజలకు ఈ సంక్రాంతి సకల శుభాలు అందించాలని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఓ ఆనంద్, నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. వారు వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి అన్నదాతలు పాడి పంటలు, భోగభాగ్యాలు, సిరిసంపదలతో తులతూగాలని ఆశించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రులు వెల్లడించారు.

కనుల పండువగా రాపత్తు ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం, అయ్యప్పగుడి గురువాయుర్పన్ మహావిష్ణు, రంగనాయకులపేట వేదాంత దేశికర్ ఆలయాల్లో ఆదివారం రాపత్తు ఉత్సవాలు, ధనుర్మాసం పూజలు కనుల పండువగా జరిగాయి. తిరుప్పావై సేవాకాలం, ఆళ్వారుల ఘోష్టి, దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్టిగానం జరిగాయి. ప్రాకారోత్సవాలు, ఊంజల్ సేవలు నిర్వహించారు. కాగా, భోగి పండుగ సందర్భంగా నగరంలోని వైష్ణవ ఆలయాల్లో సోమవారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాలు వైభవంగా జరగనున్నాయి. వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి భోగి కల్యాణం కొమ్మరపూడి గ్రామంలో జరగనుంది. వీటి కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామికి సోమవారం ఉదయం 10గంటలకు 108 లీటర్ల తేనెతో రుద్రాభిషేకం, పాలభిషేకాలు జరుగుతాయని మెంటా రామ్మోహన్‌రావు, ఏవీ రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్

విన్నర్ జేబీ, రన్నర్ వీఎస్‌యూ కళాశాల జట్టు



విజేతలతో వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు, వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, తదితరులు

వెంకటాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. టోర్నమెంట్‌లో విజేతగా కావలికి చెందిన జేబీ కళాశాల, రన్నర్‌గా వీఎస్‌యూ కళాశాల జట్టు నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. గెలుపు, ఓటములు సహజమని, క్రీడల్లో పాల్గొనడమే గొప్ప విజయమన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పీడీ డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్, టోర్నమెంట్ పరిశీలకుడు సీహెచ్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి బంగారు సరుడు, మంగళసూత్రం బహూకరణ



బంగారు సరుడు, మంగళసూత్రాన్ని ఆలయ ఈవోకు అందజేస్తున్న మహేష్‌రెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయికి ఏఎంఆర్ గ్రూప్ అధినేత అల్లూరి మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు 207 గ్రాములతో తయారు చేసిన బంగారు గొలుసు, మంగళసూత్రం బహూకరించారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న దాతలకు ఈవో శ్రీనివాసులురెడ్డి, అర్చకులు స్వాగతం పలికి, ఆదిదంపతులకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వాదములు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

- మరొకరికి గాయాలు



ఘటనా స్థలంలో సుబ్రహ్మణ్యం మృతదేహం

బిట్రగుంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నపుబట్టి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆనందం సుబ్రహ్మణ్యం (62) మృతి చెందగా, ఆయన మనమడు అఖిల్ గాయాల పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు, అల్లూరు మండలం సింగపేటకు చెందిన సుబ్రహ్మణ్యం నెల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లి మనుమడుతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ వైపు వేగంగా వెళుతున్న లారీ టీవీఎస్ ఎక్సెల్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ జంపాని కుమార్ వెంటనే ప్రమాదానికి కారణమైన లారీని వెంబడించి గౌరవరం టోల్‌గేట్ వద్ద డ్రైవర్ని అదుపులోకి తీసుకున్నాడు.ఈ ప్రమాదంలో గాయపడిన మరోవ్యక్తి ఆనందం అఖిల్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని అఖిల్ తండ్రి లక్ష్మీనారాయణ తెలిపారు. మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని మరొకరు..

విడవలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు పెద్దపాలెం రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చెందారు. పోలీసుల కథనం మేరకు.. ఊటుకూరు కంచరపాలెంకు చెందిన గరికపాటి భాస్కర్‌రావు(52) వ్యక్తిగత పనుల నిమిత్తం పెద్దపాలెంకు వెళ్లి తిరిగి ఇంటికి పోతుండగా ఊటుకూరు నుంచి వెంకటరెడ్డిపాలెం వైపు పోతున్న బొలేరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ నరేష్‌కుమార్ యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాతికేళ్ల అపూర్వ సమ్మేళనం



వారంతా రకరకాల వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఎక్కడెక్కడో జీవిస్తున్నారు. వారి పిల్లలు కూడా పెద్దవాళ్లయ్యారు. అలాంటి వారు ఒక్కసారిగా బడిపిల్లలుగా మారిపోయారు. అప్పట్లో పాఠశాలలో చేసిన అల్లరి, ఆడిన ఆటలు, చెప్పుకున్న కబుర్లను, పెట్టుకున్న గిల్లికజ్జాలను గుర్తుచేసుకుని ఆనందంగా నవ్వుకున్నారు. ఇప్పటి కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకుని స్వాంతన పొందారు.

జిల్లాలోని గండిపాళెం ఏపీ గురుకుల విద్యాలయంలో 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మిత్రులంతా ఒక్కచోట చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలలో తడిసి ముద్దయ్యారు. అనంతరం గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి నటరాజ్, కే చంద్రశేఖర్, ఎస్కే రసూల్, టీ దిలీప్‌కుమార్, జీ షారోన్ సుమన్, కే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం

● బంధువుల రాకతో గ్రామాల్లో సందడి ● పిండివంటల ఘుమఘుమలు ● కిటకిటలాడుతున్న దుకాణాలు ● భోగికి ఏర్పాట్లు



ఆత్మకూరులో రద్దీగా ఉన్న వస్త్రదుకాణాలు



సంగం: పిండి వంటలు చేస్తున్న కుటుంబ సభ్యులు



బిట్రగుంట: భోగి మంటకు తాటాకు తీసుకెళ్తున్న యువకుడు

ఆత్మకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి శోభ నెలకొంది. దూరప్రాంతాల నుంచి బంధువుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. విద్యార్థులు సంక్రాంతి సెలవులకు గ్రామాలకు వచ్చి కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతున్నారు. ప్రతి ఇంట్లో పిండివంటల ఘుమఘుమలు గుప్పుమంటున్నాయి. ఆత్మకూరు పట్టణంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సందడి నెలకొంది.

కిటకిటలాడుతున్న వస్త్ర, చిల్లర దుకాణాలు

కొనుగోలుదారులతో వస్త్ర, చిల్లర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల నుంచే కాకుండా ఏఎస్‌పేట, చేజర్ల, అనంతసాగరం మండలాలకు చెందిన ప్రజలు ఆత్మకూరు పట్టణంలో పలు వస్తువులు కొనేందుకు రావడంతో దుకాణాలు రద్దీగా మారాయి. భోగిమంటలు వేసేందుకు యువకులు తాటాకులు, వివిధ సామాగ్రిని సమకూర్చుకున్నారు. కోళ్ల దుకాణాల వద్ద, వస్త్రదుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

● సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి మంటలకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచే యువకులు భోగి మంటలకు కావలసిన తాటాకు, కంప తదితర సామాగ్రిని సిద్ధం చేశారు. అర్థరాత్రి కాగానే భోగి మంటలు వేసేందుకు సర్వ సిద్ధం చేశారు. చికెన్ దుకాణాలు కళకళ లాడాయి.

●ఉదయగిరి: ఉదయగిరి పట్టణంలో ఆదివారం సంక్రాంతి శోభ నెలకొంది. దుస్తులు, నిత్యావసర వస్తువుల దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. మరోవైపు మహిళలు నివాసాల్లో పిండి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. అన్నిరకాల నిత్యావసర వస్తువులు, దుస్తుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

సీతారామపురం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో సందడి నెలకొంది. దూర ప్రాంతాలలో ఉంటున్న బంధువులు సొంత ఊర్లు చేరుకుంటున్నారు. పిండి వంటలతో ప్రతి ఇల్లు ఘుమ ఘుమలాడుతోంది. భోగి మంటలకు తాటాకులను సిద్ధం చేసుకున్నారు.

● బిట్రగుంట : గతంలో భోగి పండుగ వస్తుందంటే పల్లెల్లో రెండు వారాల ముందే వెంపలచెట్లు, ముళ్లకంప కొట్టుకొచ్చి గుట్టలు వేశారు. అవి ఎండాక భోగి మంటలోల వేసేవారు. కాలం మారే కొద్ది పట్టణాల్లో చదువుకుంటున్న యువత కొందరు సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వచ్చి సమయం లేకపోవడంతో తాటాకు మోపులతోనే పండుగ చేసుకుంటున్నారు. దీంతో తాటాకుకు డిమాండ్ ఏర్పడింది.

●కలిగిరి : భోగిని పురస్కరించుకొని మండలంలోని ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్నారులు, యువకులు ఆదివారం పొలాల వద్దకు వెళ్లి తాటాలను ఆటోల్లో ఇళ్లకు తరలించారు. ప్రతి కుటుంబంలో పిండివంటలు చేసుకుంటూ కనిపించారు. దూరప్రాంతాల వారు గ్రామాలకు రావడంతో పండగ వాతావరణం నెలకొంది.

తీరప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి రూరల్, జనవరి12(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తుమ్మలపెంట, అన్నగారిపాలెం పంచాయతీల్లోని గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కొత్తసత్రం దళితవాడలో సీసీ రోడ్డు నిర్మాణం, చినరాముడుపాలెం బీచ్ రోడ్డు, తుమ్మలపెంట, పల్లెపాలెం లో సీసీ రోడ్లు, రెసిడెన్షియల్ స్కూల్ రోడ్డు, తుమ్మలపెంట బీచ్ రోడ్డుకు ఆయన భూమిపూజ చేశారు. అలాగే నడింపల్లి నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పాత పట్టపుపాలెం లో సీసీ రోడ్డు, ఒట్టూరులో సీసీ రోడ్డు, వెంకటేశ్వరపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అన్నగారిపాలెం సర్పంచి గోళ్ల సుప్రియ, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, టీడీపీ నేతలు ఆవుల రామక్రిష్ణ, పాలడుగు రంగారావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● క్రీడాపోటీల ప్రారంభం

కావలి: పట్టణంలో పలు క్రీడా పోటీలను ఆదివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభించారు. వైకుంఠపురం యూత్ ఆధ్వర్యంలో వైకుంఠపురంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారితో కలిసి సరదాగా కొంతసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. అలాగే గుర్రం పెట్రోల్ బంకు వెనుక కేకేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు.

కూటమి ప్రభుత్వంలో కష్టజీవులకు న్యాయం

● ఎమ్మెల్యే ఇంటూరి



108 సిబ్బందికి కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కష్టాన్ని గుర్తించి వారికి న్యాయంచేసే ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. 108 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బందికి రూ. 4వేలు వేతనం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటూరికి 108 సిబ్బంది ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. జీతం పెంచిన సందర్భంగా ఎమ్మెల్యేతో కేకు కట్ చేయించారు. కార్యక్రమంలో డాక్టరు ఇంద్రాణి, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, మువ్వల భూషయ్య, శిగా తిరుపాలు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, చీదెళ్ల వేణుగోపాల్ పాల్గొన్నారు.

అనివేటి మండపం పనులు వేగవంతం చేయండి



యాలీస్తంభాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి మానుగుంట

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన అనివేటి మండపం పనులను వేగవంతం చేయాలని మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన అంకమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మండపం నిర్మాణాన్ని, యాలీ స్తంభాలను పరిశీలించి, సూచన లిచ్చారు. మండపం పనులతోపాటు ఆలయం పూర్తయిన పనులకు తుదిమెరుగులు దిద్దాలన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, శిల్పి శ్రీనివాస్ ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులరెడ్డి

అనంతసాగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పడమటి కంభంపాడు గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను భారత్ మరియు మయన్మార్ దేశాల రాయబారి బీ శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆటలు మానసికోల్లాసానికి దోహదప డతాయన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఏలూరు ప్రసాద్, విశ్రాంత ఎంఈవో బాలకృష్ణారెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు, సభ్యులు వెంకటరమణారెడ్డి, కత్తి పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల ప్రారంభం

● ఆత్మకూరు : పట్టణంలోని ప్ర భుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముందుగా క్రీడాకారులు మున్సిపల్ బస్టాండ్ లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీగా క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. సీపీ ఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్ రాజు, డీవైఎఫ్ఐ నాయ కులు పి జిలానిబాష, సీఐటీయు నాయకులు జి శివప్రసాద్ తదితరులు క్రీడాపోటీలను ప్రారంభించారు. అనతరం క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకుడు జి లక్ష్మీపతి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ షేక్ సంధాని, సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి, డీవైఎఫ్ఐ నాయకులు ఆళ్ల హజరత్తయ్య, నందా శ్రీను, ఫయాజ్, మహేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల కంట్రోల్ వ్యవస్థ పరిశీలన



సీసీ కెమెరాల కంట్రోల్ వ్యవస్థను పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని సీసీ కెమెరాల కంట్రోల్ వ్యవస్థను ఆదివారం డీఎస్పీ కె వేణుగోపాల్ పరిశీలించారు. సర్కిల్ కార్యాల యంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ వ్యవస్థ ద్వారా పట్టణంలోని ఏఏ ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేశారో పరిశీలించారు. సీసీ కెమె రాల ద్వారా పటిష్టమైన నిఘా ఉందని, నేరాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినందుకు సీఐ జి గంగాధర్, ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్‌లను ఆయన అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

జలదంకి, జనవరి12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్ల మెసేజ్‌లు, మోసపూరితమైన మాటలతో ఆశలు కల్పించి మోసం చేస్తారని ఎస్ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు. అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం ఆమె జలదంకి బస్టాండు కూడలిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటీపీ చెప్పమని తెలియని ఫోన్‌నెంబరు నుంచి ఎవరైనా అడిగితే చెప్పకూడదని అన్నారు. సంక్రాంతి పండుగకు ఎవరైనా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట లాంటి ఆడితే తమకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లతీఫున్నీసా

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



కావలి : వివేకానందుడికి నివాళులు అర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం వివేకానంద విగ్రహ కమిటీ బాధ్యులు, రెడ్‌క్రాస్ బాధ్యులు వేర్వేరుగా నిర్వహించారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ట్రంకు రోడ్డులో ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, కమిటీ బాధ్యులు నారా మాలకొండయ్య నాయుడు, బొచ్చు వీరాస్వామి, చన్నా వెంకట్రామయ్య, మాలకొండారెడ్డి, బీజేపీ నేత కందుకూరి వెంకటసత్యనారాయణ, టీడీపీ నేతలు పోట్లూరి శ్రీనివాసులు, మోదరన్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ. రవిప్రకాష్, డాక్టర్ బెజవాడ రవికుమార్, కలికి శ్రీహరిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ముందుగాఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎస్.రాజ్యలక్ష్మి, నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి సూర్యం, పెంచలయ్య, రామ్‌చరణ్, హర్షవర్ధన్, కౌసిక్ పాల్గొన్నారు.

●సంగం : స్వామి వివేకానంద జయంతిని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు సురేంద్ర రెడ్డి, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల రోశయ్యయాదవ్, చల్లా సుబ్బరత్నం, మస్తాన్, దుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని గువ్వాడిలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోడెందుల సుధాకర్, యువ నాయకులు యాదగిరి ప్రభాకర్‌రావు, వంశీ, కేశవ, చెన్నారాయుడు, కిరణ్, లోకేష్, రవీంద్ర, సతీష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వింజమూరు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కందల మధు, పి వెంగయ్య, డేగ మధుయాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల నమోదు

● ఎన్ వెంకటరావు, సీఐ, ఉదయగిరి



ఉదయగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు ఆదివారం సూచించారు. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేకాట, కోడి పందేల స్థావరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

? జూద స్థావరాలను అడ్డుకోగలరా.

! గ్రామాల్లో జూదాలకు, కోడి పందేల నిర్వహణకు ఎలాంటి అనుమతుల్లేవు. ఆ యా పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేశాం.

? చోరీల నియంత్రణకు చేపట్టిన చర్యలు ఏమిటి.

! ఉదయగిరి సర్కిల్ పరిధిలో చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం. పండుగ సమయం కావడంతో చైన్‌స్నాచింగ్ జరిగే అవకాశాలున్నాయి. ఆలయాలు, ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లే మహిళలు, యువతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

? ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

! ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతంలో వేగ నియంత్రణకు కళ్లెం వేయడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

కప్పరాళ్లతిప్పలో ఎక్సైజ్ ర్యాలీ

బిట్రగుంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప, బాడన్ పేటలలో ఆదివారం కావలి ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో నవోదయం-2.0పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు మండలంలోని కడనూతల, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం, తాళ్లూరు తదితర పంచాయతీల్లో నాటుసారా తయారీ కేంద్రాలను గాలించారు. అనంతరం నవోదయం 2.0పై స్థానికులకు వారు వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆకుల డేవిడ్‌పాల్, మేకల శ్రీనివాసులు, ఆవుల నాగేశ్వరరావు, నెల్లూరు, బుచ్చి, కలిగిరి సీఐలు కే.పీ.కిశోర్, ప్రసన్నలక్ష్మి, జలీల్‌ఖాన్, పాల్గొన్నారు.

అలరించిన పాటకచేరి

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీకేఆర్ అండ్ ఫ్రెండ్స్ మ్యూజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పాటకచేరి నిర్వహించారు. స్వరనివాళి పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వర్ధమాన గాయకులు పాడిన పాటలు శ్రోతలను అలరించాయి. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, గాయకుడు తురకా కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, దండోరా దాస్, మహమ్మద్ యూసుఫ్, చలంచర్ల సుబ్బారావు, వీ శరత్, ఆర్వీ రమేష్, విజయ్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

రిజ్వాన్‌కు సత్కారం

కావలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకుడు షేక్ రిజ్వాన్‌కు ఇటీవల చెన్నైలోని ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రిజ్వాన్‌ను వాయిస్ ఆఫ్ ముస్లి మైనార్టీ అధ్యక్షుడు మొఘల్ సలీంబేగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాష సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ పీ. శ్రీధర్, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డీ. రవిప్రకాష్, విట్స్ కళాశాల ప్రొఫెసర్ షేక్ రజ్వి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ ఖలీల్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ నవాజ్‌ఖాన్, విశ్రాంత అధ్యాపకులు ప్రసాద్‌రావు, ఘనీబాష పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

సీతారామపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో మాజీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసులు, తోట మనోహర్, రామిశెట్టి తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

● రైతుల ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టిం చి సాగు చేసిన వరి పంటకు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. దళారులు రైతుల దగ్గర నుంచి 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తుండంతో పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. కొంతమంది రైతులు పెట్టుబడులకు తెచ్చిన నగదుకు వడ్డీలు పెరిగిపోతుండడంతో గతిలేక వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేత ఖాదర్ మస్తాన్ సేవలు ఆదర్శనీయం

అనంతసాగరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నాయకుడు, దివంగత ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఖాదర్‌మస్తాన్ సేవలు ఆదర్శనీయమని జేవీవీ జిల్లా నాయ కులు గాడి సుధాకర్ తెలిపారు. ఖాదర్‌మస్తాన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం అనంతసాగరంలో ఆయన ఉత్తర క్రియలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో అబ్బాస్‌అలీ, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

పశుపోషకులకు గోకులం షెడ్లు ఓ వరం

వలేటివారిపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు పశు పోషకులకు ఓ వరమని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ అశోక్ తెలిపారు. మండలంలోని పోకూరులో ఘట్టమనేని రమాదేవి నిర్మించుకున్న గోకులం షెడ్డును స్థానిక టీడీపీ నాయకులు ఎన్ రవీంద్ర, జీ హరికృష్ణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్ సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు ఎస్ తిరుమల, ఎం మాల్యాద్రి, జీ లక్ష్మీనరసింహం, ఏ వెంకటేశ్వర్లు, బీ నరసింహం, ఎన్ రమణయ్య, ఎన్ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మండలంలోని 43 మందికి రుణాలు అందించనున్నట్లు తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు



కలిగిరి: పందెం రాయుళ్లతో పోలీసులు

కలిగిరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు గుడ్లదొన అటవీ ప్రాంతంలో ఆదివారం కోడిపందేలపై పోలీసులు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4200 నగదు, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉమా శంకర్ తెలిపారు.

●వింజమూరు: ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ కె వీరప్రతాప్ తక్కెళ్లపాడు అటవీ ప్రాంతంలో కోడిపందాల స్థావరాలపై సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని 5 కోళ్లు, 26వేల 50 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

జూద స్థావరంపై దాడి

●సంగం : మండలంలోని తిరుమనతిప్పలో అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీ ఇళ్లలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం ఎస్ఐ రాజేష్ దాడిచేసి ముగ్గురు జూదగాళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1180 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టారు.

న్యూస్ బాక్స్

ప్రజలకు నేతల సంక్రాంతి శుభాకాంక్షలు

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీమంత్రి మాను గుంట మహీధరరెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్ చౌదరి, వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సంక్రాంతిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

ఘనంగా గంధ మహోత్సవం

సంగం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న ఆస్తానా ఏ నూరియా దర్గాలో హజతర్ షేక్ షా నూరి సాహెబ్ ఆధ్వర్యంలో శ్రీ హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిష్టి హసన్ సంజరీ రహమతుల్లా అలై అజ్మీరి స్వామి గంధ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

న్యూస్ బాక్స్

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పొదలకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు సర్కిల్ పరిధిలోని రెండు మండలాల్లో ఎక్కడైనా పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శివరామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా పోలీసులకు 112, 9440700006కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

● తోటపల్లిగూడూరు : మండలంలో ఎక్కడైనా పేకాట, కోడి పందాలు, తదితర జూదాలు నిర్వహిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వీరేంద్రబాబు కోరారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించవద్దని హెచ్చరించారు.

● బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతి పండుగలను ఆనందోత్సాహంగా చేసుకోవాలని, పేకాట, కోడిపందేల జోలికి వెళ్లి ఇబ్బందులు పడవద్దని సీఐ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. ఆయన ఎస్ఐ సంతోష్‌రెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు.

● వెంకటాచలం : సంక్రాంతి సందర్భంగా నిషేధిత జూదాల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ఎస్ఐ ఆంజనేయులుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు.

ఉపాధ్యాయ నాయకుడు మైనేనికి ఘన నివాళి

కోవూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా ఆదివారం సీతా పోలయ్య భవనంలో ఆయన చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను చైతన్యపరచేందుకు మైనేని సాగించిన కృషి అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలి, నాయకులు వెంకటేశ్వర్లు, బీ వెంకయ్య, సుబ్బారావు, చెంచయ్య, శివకుమార్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పొట్టేటి రవీంద్రబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

వెంకటాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం నుంచి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయని ఆర్గనైజర్ కొప్పోలు వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 15వ తేదీ వరకు క్రికెట్, వాలీబాల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్‌లో మొదటి బహుమతి రూ.5 వేలు, రెండువ బహుమతి రూ.4వేలు, వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.4వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం సమావేశమైన పెన్షనర్లు అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా కే.రఘునాథరావు, కార్యదర్శిగా బి.యానాదయ్య, గౌరవ అధ్యక్షుడిగా పీ.వీ.రమణయ్య, కోశాధికారిగా కే.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా టీ.శ్రీనివాస్, ఆర్.పెంచలనారాయణ, బీ.రఘునాథరావు, ఏ.సుబ్బయ్య, బీవీ.రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎల్.మల్లికార్జునరావు, ఏ.మస్తాన్‌రావు, వీ.రమణయ్య, కే.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రమణయ్య, జిల్లా అధ్యక్షుడు గౌసల పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యూటీఎఫ్ నేతలు వీవీ.శేషు, హజరత్ బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీకి లేదు : జనసేన

వెంకటాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత వైసీపీ నేతలకు లేదని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమైన విషయమన్నారు. ఈఘటన అధికారుల నిర్లక్ష్యంతో జరిగిందా లేక రాజకీయ కుట్ర అనే విషయాలపై కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తుందన్నారు. దీనిపై వైసీపీ శవరాజకీయాలు చేస్తుండడం సిగ్గుచేటని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేశారని మండిపడారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి రోజాకు లేదన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఆది వారం దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న వల్లపు నవీన్‌ను అదుపులోకి తీసుకొని 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు మురళీకృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

సై.. సై.. జోడెడ్లా బండీ!

● నేడు కోవూరులో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

కోవూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వస్తోందంటే జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల ఎడ్ల పోషకులకు ఎంతో ఆనందం. ఎందుకంటే చాలా ఏళ్ల నుంచి సంక్రాంతి పర్వదినాల్లో కోవూరు కేంద్రంగా ఎడ్ల పరుగు పందాలు నిర్వహించడమే అందుకు కారణం. ఈ పోటీ కోసమే రైతులు ఎడ్లను ప్రత్యేకంగా పెంచుతారు. సంక్రాంతి రోజుల్లో రైతుల ఇంటి ముంగిట ధాన్యరాశులు వెలిసేవి. కళకళలాడే గృహాల్లో రైతులు తమ పశుసంపదకు కనుమ పండుగ రోజు పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో తమ ఎడ్లకు భోగి పండుగ నాడు పోటీలు పెట్టడాన్ని పూర్వమె ప్రారంభించారు. అవి కాస్త రాష్ట్రస్థాయి పోటీలకు చేరాయి. ఏళ్లతరబడి ఈ పోటీలను క్రమపద్ధతిలో నిర్వహించేందుకు కమిటీలు ఏర్పా టవుతాయి. ఆ కమిటీ నిర్ణయాల మేరకే ఎలాంటి ఉద్వేగాలకు తావులేకుండా ప్రశాంతంగా పోటీలు జరుగుతాయి. ఈ పోటీలను కోవూరు నుంచి యల్లాయపాళెం వెళ్లే కొత్తూరు రోడ్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పటి లాగే ఈ ఏడాది కూడా సోమవారం భోగి పండుగ నాడు పోటీలు నిర్వ హించేందుకు శ్రీకారం చుట్టారు. పోటీకి తీసుకువచ్చే ఎడ్లను పోటీదారు లు ముందుగా తమ ఇళ్లల్లో పూజించి తీసుకువస్తారు. పసుపు, కుంకుమ పూసి కర్పూర హారతులతో దిష్టితీసి జోడెడ్ల బండ్లను కొత్తూరు రోడ్డుకు మందీమార్బలం తో తీసుకువస్తారు. సంక్రాంతి శోభ ఉట్టిపడే విధంగా రైతులు పోటీకి సిద్ధమై రోడ్డుపై రైతుదర్పం ప్రదర్శిస్తూ కన్పిస్తారు. దీంతో ఎడ్ల మువ్వడి సవ్వళ్లతో పట్టణం మార్మోగిపోనుంది.



● నిబంధనలు పాటించాల్సిందే..

రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాల్లోనే పోటీదారులు నిర్వహకులు విధించే నియమ నిబంధనలు పాటించాలి. పరుగు పందెంలో ఎడ్లకు కష్టం కల్గించకూడదు. ఎడ్లను హింసిస్తే పోటీ నుంచి తప్పిస్తారు. రెండు జాటీలను మాత్రమే ఎడ్లను తోలే వారు ఉపయోగించాలి. జాటీల్ని కమిటీ ముందుగా పరిశీలిస్తుంది. పోటీదారుడు ఒకసారి మాత్రమే ఎడ్ల పందెంలో పాల్గొనాలి. ఎడ్లు రెండు కిలోమీటర్లు మేర పరిగెత్తిన వేగాన్ని స్టాప్ వాచ్ సహాయంతో లెక్కిస్తారు. తక్కువ సమయంలో గమ్య స్థానాన్ని చేరుకొన్న ఎడ్ల యజమానులకు బహుమతి ప్రదానం చేస్తారు. ప్రతి ఏటా ప్రథమ బహుమతిగా నారపరెడ్డి రాధాకృష్ణారెడ్డి, వేమారెడ్డి పద్మనాభరెడ్డి జ్ఞాపకార్థం షీల్డులు బహూకరిస్తున్నారు. ఈ ఏడాది పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.13,116, తృతీయ బహుమతి రూ.10,116, నాల్గవ బహుమతి రూ.8,116, ఐదవ బహుమతి రూ. 6,116 అందించనున్నారు. పోటీల నిర్వహణ కమిటీకి కోవూరు బండ్ల సంఘం సహకరిస్తోంది.

● పోటీలకు కొత్తూరురోడ్డు ముస్తాబు

కొత్తూరు రోడ్డులో ఎడ్ల పరుగు పందెం నిర్వహించేందుకు రైతు సమన్వయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రోడ్డుపై గుంతలు, ముళ్ల కంపలు, రాళ్లు లేకుండా శుభ్రం చేశారు. పోటీలో పాల్గొనేందుకు వచ్చిన ఎడ్లకు అరవింద రైసుమిల్లులో స్థలాన్ని కేటాయించారు. పోటీలను తిలకించేందుకు వచ్చే రైతులందరికీ ఉచితంగా భోజన వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్ల ప్రేమికులు పోటీలు తిలకించేందుకు కోవూరుకు ఉదయానికే చేరుకోనున్నారు.

కామాక్షితాయి సేవలో న్యాయాధికారి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో జిల్లా మూడవ అదనపు న్యాయాధికారి ఎల్.తేజోవతి తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం మల్లికార్జున స్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, వేదపండితుల ఆశీర్వచనములు అందజేశారు.



జొన్నవాడలో న్యాయాధికారి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో శ్రీనివాసులురెడ్డి

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు

సైదాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) వెంకటగిరి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో మండల నాయకులు ఆదివారం టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. తుమ్మల తలుపూరుకు చెందిన మండల క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, జోగిపల్లి పంచాయతీ సర్పంచు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు గుంటమడుగు కృష్ణంరాజు ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు అమ్మినేని సుబ్రహ్మణ్యంనాయుడు, కేపీ.రాజు, రాజశేఖర్ రాజు, పాములూరి శ్రీనివాసులు నాయుడు, కందాటి విజయరాఘవ రెడ్డి, కోటయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామకృష్ణ సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న సీనియర్ నాయకుడు దిలీప్ చౌదరి

ఈతతో సంపూర్ణ ఆరోగ్యం

కోవూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈత కొట్టడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించే వీలుందని ప్రముఖ ఈత క్రీడాకారుడు మునగా నాగేశ్వరరావు అన్నారు. పెన్నానది తీరాన పోతిరెడ్డిపాళెం సమీపంలో ఆదివారం ఈతగాళ్లైన సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకుడు చెంగయ్య, ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన హరిసింగ్, కనిగిరి రిజర్వాయర్ నీటిపారుదల సంఘం ఉపాధ్యక్షుడు ఎన్ రమణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈత కొట్టడం ద్వారా శరీరదారుఢ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, వెంకటేశ్వరరావు, వెంకటరమణారెడ్డి, రాజా, నారపనాయుడు, సుధాకర్‌యాదవ్, రత్నయ్య, బాబూరావు, లక్ష్మీకాంతం, నందకుమార్ పాల్గొన్నారు.



ఈతగాళ్లను సన్మానించిన నిర్వాహకులు

మొదలైన సంక్రాంతి సందడి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఆదివారమే సంక్రాంతి సందడి మొదలైంది. సోమవారం భోగి పండుగకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. కొత్త దుస్తులు, నిత్యావసరాలు, కూరగాయలు, కోళ్లు, భోగి సరంజామా, రంగులు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజలతో దుకాణాలు, బస్టాండ్ సెంటర్, బజారు వీధి కిటకిటలాడాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి భోగి మంటలకు అవసరమైన తాటాకులు తెచ్చి బుచ్చిలో విక్రయించారు. ఆదివారం రాత్రి నుంచే యువత పలు ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు.

నేడు కోదండరామాలయంలో భోగి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలువైవున్న కోదండరామస్వామి ఆలయంలో సోమవారం భోగి పండుగ సందర్భంగా వరదరాజస్వామి, ఆండాళమ్మలకు భోగి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'వాత్సల్య'కు రూ.లక్ష విరాళం

నెల్లూరు (హరనాధపురం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి ప్రముఖ వైద్యుడు టీవీ కోటేశ్వరరావు, డాక్టర్ పీ లక్ష్మీ దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కోటేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా జనహిత, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు విరాళం చెక్కును అందించారు. అలాగే, శరణాలయంలోని 80 మంది బాలలకు విశ్రాంత అధికారి వారణాసి శేషగిరిరావు సంక్రాంతి సందర్భంగా దుస్తులను బహూకరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత చేతుల మీదుగా వీటిని ఆదివారం అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సురేష్, ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు పిండి వంటలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఈ జీవీ రామిరెడ్డి, మానవ సేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు అరవ పరిమళ, ఆర్ ఇందిరా, జీవీ పుల్లారెడ్డి, కల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విరాళం చెక్కు అందజేస్తున్న డాక్టర్ దంపతులు

సంక్షేమ గురుకులాలకు నిధులివ్వాలి

నెల్లూరు(విద్య), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంక్షేమ గురుకు ల పాఠశాలలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి తిరుమలయ్య ఓ ప్రకటనలో కోరారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన దళిత సంక్షేమ గురుకులాలకు సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరు నెలలుగా మెస్ చార్జీలు మంజూరు చేయకపోవడంతో పాటు, ఉద్యోగులకు మూడు నెలల వేతనాలు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

యువకుడిపై కత్తితో దాడి

ముత్తుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం కోసం డబ్బులు ఇవ్వనందుకు ఓ యువకుడిపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసిన ఘటన బ్రహ్మదేవి కూడలిలో ఆదివారం జరిగింది. పోలీసులు కథనం మేరకు... బ్రహ్మదేవి గిరిజన కాలనీకి చెందిన నెట్రంబాక హరి అనే యువకుడిని అదే ప్రాంతానికి చెందిన ఫజిల్ మద్యం తాగేందుకు డబ్బులు ఇమ్మని అడిగాడు. తన వద్ద లేవని చెప్పిన కోపోద్రిక్తుడైన ఫజిల్ కత్తితో దాడి చేసి హరిని గాయపరిచాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణపట్నం సీఐ రవినాయక్, ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బ్రహ్మదేవి కూడలికి చెందిన సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

లాఫింగ్ క్లబ్‌లో బెంచీల ఏర్పాటు

నెల్లూరు(విద్య), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కోసం ఏర్పాటు చేసిన నూతన బెంచీలను జిల్లా జైల్స్ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మైదానంలో వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు లాఫింగ్ క్లబ్ నిర్వాహకులు 11 బెంచీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, న్యాయవాది నన్నేసాహెబ్, బెంచీల దాతలు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షురాలు సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పద్య సారస్వత పరిషత్ వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న బొమ్మిశెట్టి యలమందయ్య పాఠశాలలో ఆదివారం పద్య సారస్వత పరిషత్ సప్తమ వార్షికోత్సవం, వివేకానంద జయంతి ఘనంగా జరిగాయి. ఆలూరి శిరోమణిశర్మ వివేకానంద స్వామి చరిత్రపై ప్రసంగించారు. ఎంఆర్ ప్రసాద్, ఎన్ బలరామయ్య నాయుడు, పద్యసారస్వత పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

వివేకానందుడి మార్గం అనుసరణీయం

నెల్లూరు(విద్య), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువతను క్రమశిక్షణ, సత్ప్రవర్తన, సన్మార్గంలో నడిపేందుకు కృషి చేసి, భారత జాతి ఖ్యాతిని దిగంతాలకు చాటిన స్వామి వివేకానంద 162వ జయంతిని ఆదివారం నగరంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుని బోధనలు, ఆయన చూపిన మార్గం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు.

● నగరంలోని శ్రీ రామచంద్ర మిషన్‌లో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని హార్ట్ ఫుల్‌నెస్ ధాన్య కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వెంకట కృష్ణ అన్నారు. అనంతరం స్వామి వివేకానంద వేషధారణలో నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. యువతకు పలు క్రీడాపోటీలు, ముగ్గుల పోటీలు, నాటికలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. సమగ్ర శిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, విశ్రాంత ఎంపీడీవో నరసింహారెడ్డి, రామచంద్రమిషన్ ప్రతి నిధి ఎం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని సెయింట్ జోసఫ్ నర్సింగ్ కళాశాలలో ఎన్‌వైకే, ఎన్ఎస్ ఎస్ సంయుక్తంగా వివేకానంద జయంతి నిర్వహించాయి. వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ హాజరై వివేకానందుడికి అంజలి ఘటించారు. ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఆంథోనీ మేరీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

● ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకులని ప్రముఖ మోటివేటర్ డీఎన్ రంగనాథరావు అన్నారు. ఆధునిక యుగంలో ఒత్తిడిని అధిగమించేందుకు వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేసన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్రం, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ ఫెడరేషన్....

నెల్లూరు(హరనాధపురం): స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో వివేకా నంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ జిల్లా అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, ఎన్ విజయకుమార్, కే సుబ్రహ్మణ్యం, రమేష్ కుమార్, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఆదర్శమూర్తికి ఘన నివాళి



వివేకానందకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆదర్శాలను పాటిస్తాం

నెల్లూరు(వైద్యం): స్వామి వివేకానంద ఆదర్శాలను పాటిస్తామని ది నెల్లూరు జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్ వెల్లడించారు. ఆదివారం నగరంలోని వివేకానంద విగ్ర హానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్ర పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివిధ రాజకీయ పార్టీ నాయకులు వివేకానందుడికి ఘనంగా నివాళులర్పించాయి. ములుముడి బస్టాండు సెంటర్లోని వివేకానంద విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని తెలిపారు. బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని, ఖ్యాతిని, విశిష్టతను అంత ర్జాతీయ వేదికపై చాటిన ఆధ్యాత్మికవేత్త వివేకానంద అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెల్స్ ఇన్‌చార్జి సురేంద్రరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యశ్వంత్‌సింగ్, గడ్డం విజయకుమార్, కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, ఓబీసీ జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● జనసేన పార్టీ ఆధ్వర్యంలో మినీ బైపాస్‌లో ఉన్న వివేకానంద విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ చికాగో సర్వమత సమ్మేళనంలో వివేకానందుడి చేసిన ప్రసంగం నేటికీ ప్రపంచమంతా గుర్తు చేసుకునేదిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, ప్రశాంత్‌గౌడ్ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి

నెల్లూరు(సాంస్కృతికం): సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో వివే కానంద జయంతి వేడుకలు జరిగాయి. మినీబైపాస్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోడూరు సత్యం, లక్ష్మీనారాయణ, ముప్పిరాల సుబ్రహ్మణ్యం, మోమిడి శ్రీనివాసులు, అన్నం భవానమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో...

ఇందుకూరుపేట,(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం, సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా మహాత్మ గాంధీ, పొనక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్వామివి వేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్ర మ మేనేజర్ మనోజ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాకర్స్



స్వామి వివేకానందుడికి వాళులర్పిస్తున్న జనసేన పార్టీ నాయకులు

స్మైల్ వాకర్స్ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(విద్య), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం స్మైల్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌డీ ముదార్, కార్యదర్శిగా ఎస్‌కే అజ్మీర్ బాషా, కోశాధికారిగా బైసాని వెంకట రమణ, గౌరవాధ్యక్షుడిగా గణపం రాజగోపాల్‌రెడ్డి, న్యాయ సలహాదారుగా ఎస్‌కే ఎస్థానీ ఎంపికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. నలుబోలు బలరామయ్య నాయుడు, కిలారి తిరుపతి నాయుడు, వేలూరి రంగారావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేత వెంకటరత్నంకు నివాళి

నెల్లూరు(విద్య), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు మైనేని వెంకటరత్నంకు యూనియన్ నాయకులు నివాళులర్పించారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం వెంకటరత్నం వర్ధంతిని నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల ఇబ్బందులపై నిరంతరం పోరాటాలు చేయడంతోపాటు వారిలో అవగాహన కలిగించేందుకు విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 53, 54 డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి జహీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. తమది బెట్టింగ్‌ల ప్రభుత్వం కాదని, యువతను ప్రోత్సహించే ప్రభుత్వమన్నారు. మంత్రి పొం గూరు నారాయణ పేరు మీద ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని, జట్లు క్రీడాస్ఫూర్తిని దాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సత్యనాగేశ్వరరావు, బాలాజీ, పొత్తూరు శైలజ, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కోటంరెడ్డి

డాక్టర్ ఎల్లాప్రగడకు ఘన నివాళి


నెల్లూరు (వైద్యం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టైఫాయిడ్, పాండురోగం, బోధవ్యాధి తదితర వ్యాధులకు మందు కనుగొన్న వైద్యుడు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు 130వ వర్ధంతిని ఆదివారం నగరంలోని మదాల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మాదాల తరణ్ డాక్టర్ ఎల్లాప్రగడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లాప్రగడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, పీఎంపీలు

జ్వర నివారిణి కషాయం పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైకుంఠపురం కాశినాయన ఆశ్రమంలో ఆదివారం ఉదయం కృష్ణపట్నం ఆనందయ్య తయారు చేసిన దశామృత నిర్గుండి అనే జ్వర నివారణ కషాయాన్ని పంపిణీ చేశారు. ప్రస్తుతం నగరంలో ప్రబలిన మొండి విషజ్వరాల నివారణకు ఈ కషాయం పని చేస్తుందని 12 రకాల మూలికలతో దీనిని ఆనందయ్య తయారు చేసి ఆశ్రమానికి అందించారని నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మేకల నరసింహా రావు, సిద్ధు, వెంకటేశ్వర్లు నాయుడు, చెన్నకృష్ణ పాల్గొన్నారు.





గ్యాస్‌తో నడిచే వాహనాల తాళాన్ని కమిషనరు మౌర్యకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

గ్యాస్ ప్రాజెక్టుల ప్రారంభం..

సంతోషదాయకం

- తిరుచానూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- గ్యాస్‌తో నడిచే వాహనాలు కార్పొరేషన్‌కు అప్పగింత

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి సీఎన్‌జీ, పీఎన్‌జీ ప్రాజెక్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోనే అతిపెద్ద సహజవాయు ఉత్పత్తి సంస్థల్లో ఒక్కటైన ఏజీ అండ్ పీ - ప్రథమ్ థింక్ గ్యాస్ సంస్థ తిరుపతిలోని తాజ్ హోటల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజీ అండ్ పీ కంపెనీ ఏర్పాటు చేసిన సీఎన్‌జీతో నడిచే వివిధ రకాల వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ కోసం గ్యాస్‌తో నడిచే వాణిజ్య వాహనాలను మున్సిపల్ కమిషనర్ మౌర్యకు అప్పగించారు. ఆ తర్వాత కార్యక్రమ నిర్వాహక సంస్థ రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఏర్పాటు చేసిన సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కును.. సీఎన్‌జీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌నూ ఆయన ప్రారంభించారు. ఇక్కడి నుంచే చిత్తూరులో ఏజీ అండ్ పీ ప్రథమ్ థింక్ గ్యాస్ సీఎన్‌జీ మదర్ స్టేషన్‌ను ప్రారంభించి, నెల్లూరులో ఎస్‌సీఎన్‌జీ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఏజీ అండ్ పీ కంపెనీ రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉపాధి అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ సంస్థకు తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏజీ అండ్ పీ సంస్థ ఎండీ, సీఈవో అఖిలేష్ గుప్తా, మంత్రులు బీసీ.జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులతో పాటు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.



లీలావతి ఇంట్లో టీ కాచి వడకడుతున్న సీఎం చంద్రబాబు

ఏమ్మా.. టీ ఎలా ఉంది?
కప్పు చేతికందించి సీఎం చంద్రబాబు వేసిన ప్రశ్న

సర్, మా ఇంట్లో మీరే టీ పెట్టి మాకివ్వడం మహాభాగ్యం.
ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ లీలావతి ఇచ్చిన సమాధానమిది.

తిరుచానూరులో శరవణ, లీలావతి దంపతుల ఇంటికి అమర్చిన ఏజీ అండ్ పీ అనే సంస్థకు చెందిన డొమెస్టిక్ పైపులైన్ నేచరల్ గ్యాస్ సరఫరాను సీఎం చంద్రబాబు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఆయన లబ్ధిదారు ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలిగించి టీ పెట్టారు. ఆ దంపతులకు టీ అందజేసి తానూ తాగారు. ఏమ్మా..! టీ బాగుందా.. అంటూ సరదాగా అడిగారు. చాలా చక్కగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు. పైపులైన్ సరఫరా వల్ల గ్యాస్ అయిపోయిందనే సమస్య లేదని వాళ్లు సీఎంతో అన్నారు. మీటరులో రీడింగ్ మేరకు వాడిన గ్యాస్‌కు ప్రతినెలా కట్టాల్సి ఉంటుందన్నారు. మాటల మధ్యలో సీఎం చంద్రబాబు శరవణ కుటుంబ స్థితిగతులను ఆరా తీశారు. 'నేను కార్పెంట్ వర్క్ చేస్తాను. గతంలో ఆవులు ఉండటంతో కుటుంబ పోషణ జరిగేది. అవి చనిపోయాయి' అని వారు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. 'శరవణా.. లీలావతి, మీరు భయపడవద్దు, పీఎంఏవై కింద రూ.3లక్షలతో పాటు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్షతో కలిపి మొత్తం రూ.4లక్షలు ఇంటికి ఇస్తాం' అని అన్నారు. ఆవుల కోసం మరో రూ.2లక్షలు తక్షణ సాయం కింద అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. దాదాపు 15 నిమిషాల పాటు శరవణ కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు గడిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు నరసింహయాదవ్, అమిలినేని మధు, శ్రీధర్‌వర్మ, ఈశ్వరరెడ్డి, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, హరేరామ్, వాసు, కత్తి సుధ తదితరులు పాల్గొన్నారు.



శరవణ దంపతులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న సీఎం

ఒకరోజు ముందే సంక్రాంతి వచ్చింది

రూ.ఆరు లక్షలకు మంజూరు పత్రాలను సీఎం చంద్రబాబు అందించడంతో శరవణ, లీలావతి దంపతులు ఆనందం వ్యక్తంచేశారు. 'మాలాంటి పేదల ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు సార్ రావడం.. ఆయన దగ్గర ఉండి మాకు టీ కాచి ఇవ్వడం.. మేము అడగకుండానే మా ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని వరాల జల్లు కురిపించడం.. మా ఇంట్లో కూర్చుని 15నిమిషాలకుపైగా మాట్లాడటం.. మా జీవితంలో మరచిపోలేం. ఆయనకు మేము రుణపడి ఉంటాం. మా ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు. మాకు ఒకరోజు ముందే సంక్రాంతి వచ్చింది' అని శరవణ, లీలావతి దంపతులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శిల్పారామం వద్ద భోగి మంట

భోగి భాగ్యములివ్వ

సంక్రాంతికి స్వాగతం పలుకుతూ తిరుచానూరురోడ్డులో శిల్పారామంలో ఆదివారం రాత్రి ముందస్తు భోగిమంటలు వేశారు. సందర్శకులు కేరింతల మధ్య భోగిమంటలు వేశారు. పలుచోట్ల అర్ధరాత్రి 12 గంటలకే భోగి మంటలు వేసి భోగి భోగి అంటూ సందడి చేశారు. ఇక, శిల్పారామంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ కళాకారుల కామెడీ స్కిట్లు ఉంటాయని ఏవో ఖాదరవల్లీ తెలిపారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి పరకామణిలో బంగారు బిస్కెట్ చోరీ





పెంచలయ్య

- కాంట్రాక్ట్ ఉద్యోగి అరెస్ట్

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి ఏకంగా బంగారు బిస్కెట్‌ను దొంగిలించి పట్టుబడ్డారు.ఖాళీ ట్రాలీ నుంచి బయటకు పంపి ఆ తర్వాత తీసుకోవాలనే అతని ప్లాన్‌ను విజిలెన్స్ శాఖ బయటపెట్టింది. సాధారణంగా కానుకలతో నిండిన హుండీలను సీల్ వేసి ఆలయం వెలుపల ఉన్న పరకామణి భవనానికి పంపుతారు. హుండీలో వచ్చిన కానుకలను అక్కడ వేరు చేసి లెక్కిస్తారు. టీటీడీ ఉద్యోగులు, పరకామణి సేవకులు, ఆప్కోస్ సంస్థ ద్వారా మరికొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ పనులు చేస్తారు.వీరిలో ఆప్కోస్ నుంచి పెంచలయ్య అనే కాంట్రాక్ట్ ఉద్యోగి పరకామణిలో శనివారం విధులకు హాజరయ్యాడు. కొన్ని వస్తువులతో కూడిన ట్రేతో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు చేరుకుని గోల్డ్ రూమ్‌లోకి వెళ్లాడు. ప్లాస్టిక్ ట్రేలలో నిల్వచేసిన బంగారు వస్తువుల దగ్గరకు వెళ్లి 100 గ్రాముల బరువున్న గోల్డ్ బిస్కెట్‌ను మలవిసర్జన ద్వారం వద్ద దాచి కింది ఫ్లోర్‌కు చేరుకున్నాడు. అక్కడ దారంతో బంగారు బిస్కెట్‌ను చుట్టి 17వ నెంబరు ఖాళీ ట్రేలోని పైప్ రంధ్రంలో దాచి చెకింగ్ ప్రాంతానికి పంపేశాడు.పరకామణి భవనంలో పటిష్టమైన సీసీ కెమెరాల వ్యవస్థ ఉండటంతో ఈ వ్యవహారం మొత్తాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించి పెంచలయ్యను అదుపులోకి తీసుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

నారావారిపల్లెకు
నారా, నందమూరి కుటుంబాలు



నారావారిపల్లెలో వినతిపత్రాలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు

చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు నారావారిపల్లెకు నారా, నందమూరి కుటుంబాలు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం సీఎం చంద్రబాబు చంద్రబాబు స్వగ్రామానికి వచ్చారు. ఎమ్మెల్యే నానీతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు స్వాగతం పలికారు. అప్పటికే వేచి ఉన్న జనం సమస్యలు విని, వినతిపత్రాలు స్వీకరించారు. ఉదయం 11.30 గంటల సమయంలో మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు నారా దేవాన్ష్ వచ్చారు. వీరికి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమేంబరధర రావు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఇక, నారా భువనేశ్వరి, నారా ఇందిర, ఇతర బంధువులు శనివారమే నారావారిపల్లెకు వచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు తమ కుటుంబీకులతో పాటు నందమూరి రామకృష్ణ తదితరులతో కలిసి శేషాలచలం లింగేశ్వరస్వామిని మంత్రి లోకేశ్ దర్శించుకున్నారు. అనంతరం కందులవారిపల్లెలో వినాయకస్వామిని దర్శించుకున్నారు. అదే గ్రామంలోని తన మేనత్త అయిన కనుమూరి హైమావతి ఇంటికి వెళ్ళి 10 నిమిషాలు ఉన్నారు.

నేడు సీఎంచే పలు శంకుస్థాపనలు

నారావారిపల్లెలో పలు అభివృద్ధి పనులకు సోమవారం సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేయనున్నారు. నారావారిపల్లి పరిధిలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన.. రూ.5 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమి పూజ.. రంగంపేట జడ్పీ హైస్కూలును శ్రీసిటీ సెజ్ దత్తత తీసుకునే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు సెర్ప్ ద్వారా అందించిన 15 ఇ-ఆటోలను ప్రారంభించనున్నారు. 2 వేల ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ద్వారా సౌర విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభిస్తారు. ఇప్పటికే 20 ఇళ్లకు సోలార్ ప్యానెళ్ళు ఏర్పాటు చేయగా వాటిని చంద్రబాబు నేడు ప్రారంభిస్తారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల మానసిక సామర్థ్యాలను పెంపొందించే దిశగా కేర్ అండ్ గ్రో అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ఈజీ మార్ట్ అనే సంస్థతో నారావారిపల్లి పరిధిలోని చిన్న దుకాణాలకు అవసరమైన సరుకులు, వస్తువులను సరఫరా చేసే గూడ్స్ చెయిన్‌కు ఒప్పందం కుదుర్చుకోనున్నారు. వీటితో పాటు పలు రుణ పథకాలను కూడా మంజూరు చేసే అవకాశముంది. ఈ కార్యక్రమాలతో సీఎం చంద్రబాబు సోమవారం స్వగ్రామంలో బిజీబిజీగా గడపనున్నారు.

శేషాచల లింగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేశ్, భువనేశ్వరి తదితరులు



నారావారిపల్లెలో భారీ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి 15వ తేది వరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, కుటుంబ సభ్యులు స్వగ్రామంలో గడపనున్నారు. దీంతో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే భారీ ఎత్తున బలగాలు నారావారిపల్లికు చేరుకున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ, ఇతర శాఖల అధికారులు, సెక్యూరిటీ అధికారులు నారావారిపల్లిలో వున్నారు. సీఎం కోసం దాదాపు 700 మంది పోలీసులను నియమించారు. వీరు కాకుండా ఎస్టీఎఫ్ సిబ్బంది, డాగ్, బాంబు స్క్వాడ్‌లు అడుగడుగునా తనిఖీలు చేస్తున్నాయి. సీఎం ఇంటిలోకి ఎవ్వరినీ అనుమతించడం లేదు. అటు జిల్లా యంత్రాంగం ఇటు సీఎం కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో నారావారిపల్లిలో సంక్రాంతి సందడి నెలకొంది.

టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వోగా మణికంఠ
ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి కూడా..



తిరుపతి(నేరవిభాగం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును తిరుపతి జిల్లాలో మూడు ప్రధాన విభాగాలకు ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఆయన తిరుపతి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వోగా.. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగానూ నియమించింది. ఈ మేరకు ఇన్‌చార్జి సీవీఎస్వోగా ఆయన ఆదివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విజిలెన్సు అధికారులను పరిచయం చేసుకున్నారు. అంతకు మునుపు టీటీడీ సెక్యూరిటీ అధికారులు, విజిలెన్సు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. తిరుమలలో భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కాసేపు అధికారులతో చర్చించారు.



మిస్ గ్లోబల్ ఏసియా విజేత భావనరెడ్డి

చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మిస్ గ్లోబల్ ఏసియా-2025 విజేతగా భావనరెడ్డి చిన్నతంబు నిలిచారు. ఈనెల 9వ తేదీన మలేషియాలో నిర్సన్ సిమ్ అండ్ లియే రేనాల్డ్ ఆధ్వర్యంలో అందాల పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో 40 దేశాల నుంచి యువతులు పాల్గొన్నారు. ఇందులో చంద్రగిరికి చెందిన భావన రెడ్డి చిన్నతంబు (ఇండియా) విజేతగా నిలిచారు. ఈమె చంద్రగిరికి చెందిన రియల్టర్ సి.గోపికృష్ణ, లక్ష్మి దంపతుల కుమార్తె. మిస్ గ్లోబల్ ఏసియా విజేతగా నిలిచిన ఈమె ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన చంద్రగిరికి చేరుకోగా చేరుకోగా.. ఘన స్వాగతం లభించింది. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ కేక్ కట్ చేసి అమెకు తినిపించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేత పులికంటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న భావనరెడ్డి చిన్నతంబు



మారుతీ శివకుమార్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఒకరు తిరుపతి టౌన్‌బ్యాంకు జీఎం
- మరొకరికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రకాశ్ (55), మారుతీ శివకుమార్ (61) మృతి చెందగా ఆనంద్ అనే వ్యక్తి గాయపడ్డారు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి కట్టకిందపాలెంకు చెందిన ప్రకాశ్.. తిరుపతి టౌన్ బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తిరుపతికే చెందిన తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి శనివారం ఆయన బెంగళూరు వెళ్లారు. పని ముగించుకుని ఆదివారం తిరిగి తిరుపతికి వస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్దకు రాగానే కడప నుంచి మారుతీ శివకుమార్ అనే వ్యక్తి వెళుతున్న కారును ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వీరి కారు ఢీకొంది. ప్రమాదంలో ప్రకాశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ ఆనంద్‌ను చెన్నైకి తరలించారు. కడపకు చెందిన మారుతీ శివకుమార్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రకాష్

టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం

- అనుమతించిన ప్రభుత్వం

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గతేడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. గతేడాది నవంబరు 27న టీటీడీ ఈవో పంపిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది. టీటీడీలో రెగ్యులర్ ఉద్యోగులు, డెప్యుటేషన్‌పై పని చేస్తున్న వారికి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు, కన్సాలిడేటెడ్ పే ఉద్యోగులకు రూ. 15,400 చొప్పున అలాగే ఇతర కేటగిరీ ఉద్యోగులకు రూ.7535 చొప్పున బ్రహ్మోత్సవ బహుమానం అందించేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

వచ్చినవారికి వచ్చినట్లుగా..!

- సాఫీగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ

తిరుపతి (అర్బన్/జీవకోన/వైద్యం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్సుల్లో ఆదివారం తిరుమల వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. వచ్చినవారు వచ్చినట్లుగా టోకెన్లు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి హడావిడి లేదు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి టోకెన్లు గత 9వ తేదీన జారీచేసిన విషయం తెలిసిందే. మిగిలిన ఏడు రోజులకు సంబంధించిన టోకెన్ల జారీ ప్రక్రియను శనివారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభించారు. రద్దీ తక్కువగా ఉందని ముందుగానే గ్రహించిన టీటీడీ.. మూడు కేంద్రాలను మాత్రమే ఎంపిక చేశారు. మొదట్లో క్యూలైను ఏర్పడినా, ఎలాంటి తోపులాటలు, భక్తుల మధ్య ఒత్తిళ్లు చోటుచేసుకోలేదు. ఆ తర్వాత క్యూలైను డైరెక్టు అయ్యింది. క్యూలోని భక్తులకోసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం టీటీడీ అన్నప్రసాదాలను పంపిణీ చేసింది. రద్దీ తక్కువగా ఉన్న పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, సోమవారానికి (13వ తేది) సంబంధించి తొలుత 48వేల టోకెన్లు మంజూరు చేయగా, ఆ తర్వాత అదనంగా మరో పది వేలు కేటాయించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు 58వేల టోకెన్ల జారీ పూర్తయింది. ఆ తర్వాత 14వ తేదీ దర్శనానికి టోకెన్ల జారీ ప్రారంభించారు. మంగళవారం కూడా దాదాపు 60వేల టోకెన్లను కేటాయించారు. కాగా, కంటిన్యూగా 19వ తేది వరకు దర్శన టోకెన్లను జారీ చేయనున్నారు.



పక్షుల పండుగ ఏర్పాట్లు ప్రారంభం


జూనియర్ కళాశాల మైదానంలో ఫ్లెమింగో ఫెస్టివల్ వేదిక ఏర్పాట్లు

సూళ్లూరుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పక్షుల పండగకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపాలిటీ అధికారులు ప్రారంభించారు. చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పక్షుల పండగ జరిగే జూనియర్ కళాశాల మైదానాన్ని ఆదివారం చదునుచేసి, విద్యుత్ లైన్లను సైతం ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఫ్లెమింగో ఫెస్టివల్ జరిగే మూడు రోజుల పాటు మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సందర్శకులు తిలకించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. అలాగే పట్టణంలో ఉన్న హోర్డింగ్‌లు, బోర్డులకు కొత్త రంగులతో పక్షుల బొమ్మలు వేస్తున్నారు.

అర్చక, పురోహితులకు ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ

కోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీరామ సమేత వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో సీతారామ ధార్మిక సేవాసంస్థ సహకారంతో ప్రవాస భారతీయుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి సౌజన్యంతో అర్చక, పురోహితులకు ధార్మిక, ఆధ్యాత్మిక పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని ఆయా ఆలయాలకు విశ్రాంత ఉపాధ్యాయులు వీపీఎస్ నారాయణరావు, రామిశెట్టి, హేమంత్ కుమార్, నాయుడమ్మ చేతులమీదుగా ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత హిందూ సభ నియోజకవర్గ అధ్యక్షుడు మురళీధర్ కుమార్, శ్రీనివాసులు, శరవణ, శేషాద్రిశర్మ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

బాలాయపల్లి, జనవరి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌పీ కండ్రిగ అడవుల్లో కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ లక్ష్మీ భవానీ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. మంది మందిని అదుపులోకి తీసుకుని, ఐదు కోళ్లు, రూ.9050 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడిగా దేవేంద్రరెడ్డి



కోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి తిప్పపై ఆదివారం విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సమావేశం జరిగింది. గూడలి గ్రామానికి చెందిన లొక్కు దేవేంద్రరెడ్డిని గూడూరు జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మురళీరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, రమణయ్య, సురేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో మోపూరు వెల్లంపల్లి రోడ్డుకు మోక్షం


బురదతో మోపూరు వెల్లంపల్లి రోడ్డు - మరమ్మతులు అనంతరం

డక్కిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో గుంతల రోడ్డుకు మోక్షం లభించింది. డక్కిలి మండలం మోపూరు రోడ్డు నుంచి వెల్లంపల్లి గ్రామానికి వెళ్లే దారి అడుగడుగున గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. సుమారు రెండు కిలో మీటర్ల పొడవునా రోడ్డంతా గుంతలు తేలడంతో పదేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి నాటికల్లా రోడ్లపై గుంతలు ఉండకుడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలకు స్పష్టం చేయడంతో కురుగొండ్ల రామకృష్ణ గ్రామస్తులతో చర్చించారు. మోపూరు వెల్లంపల్లి గ్రామానికి చెందిన మహదేవ నాయుడు, శేషాద్రి నాయుడు రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారు. పనులు చేపట్టడంతో గుంతల రోడ్డు కాస్తా అద్దంలా తయారవ్వడంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి.

చేడిమాలలో రక్తదాన శిబిరం

చిల్లకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేడిమాల గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు, సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు రాజనేని శ్రీనివాసులు నాయుడు, శిరీష, పిచ్చయ్య నాయుడు, రామయ్య నాయుడు, శ్యామ్‌ప్రసాద్ నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

గూడూరు అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డిని ఆదివారం గూడూరుకు చెందిన పార్టీ నాయకులు నాయుడుపేటలోని సన్మానించారు. కార్యక్రమంలో అరికట్ల బాలకృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల వితరణ

గూడూరు అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులు, నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రాజనేని శ్రీనివాసులు నాయుడు, డాక్టర్ హెలెన్, వెంకటేశ్వర్లు నాయుడు, బాబు, భాస్కర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో యువజన దినోత్సవం

కోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరణ

బాలాయపల్లి, జనవరి(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ శింగంశెట్టి భాస్కరరావు, దాసరి ప్రభాకర్ నాయుడు, రాయి సత్యనారాయణ రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

భోగి మంటలు

కోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, గూడలి, తిన్నెలపూడి, కోట క్రాస్ రోడ్డు, పట్టణంలో ఆదివారం రాత్రి ముందస్తు భోగి పండుగ సంబరాలు జరిగాయి. సోమవారం భోగి పండుగ జరుపుకోనున్న నేపథ్యంలో ముందుగానే ఆయా గ్రామాల్లో యువత కేరింతలు కొడుతూ భోగిమంటలను వేసి సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం పలికారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కలగుంట సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న రైల్వేబ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారు జామున వరికోత మిషన్ మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవరు కుమార్, ఆపరేటర్ మురళి స్వల్ప రక్తగాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రేపల్లి నుంచి సత్యవేడుకు వరికోత మిషన్‌తో వెళుతున్న లారీ రైల్వేబ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తా పండింది. ఈ ప్రమాదంలో వరికోత మిషన్ తునాతునకలైంది. గాయపడిన లారీ డ్రైవరు కుమార్, ఆపరేటర్ మురళికి దొరవారి సత్రం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి సూళ్లూరుపేటకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

చిల్లకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... పోలీస్‌స్టేషన్ సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని మహిళ రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మహిళను నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

ఓజిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాయని ఎస్‌ఐ స్వప్న హెచ్చరించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. సంక్రాంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె ప్రజలను కోరారు.


నదిలో ఇసుకను నింపుకొనేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు - కాళంగి నుంచి ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లు

కాళంగిని ఖాళీ చేసేస్తున్నారు

- చెలరేగుతున్న ఇసుక మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక వ్యవహారంలో వేలు పెడితే సహించను.. ఎమ్మెల్యేలు, నేతలు జాగ్రత్తగా వ్యవహరించాలి.. ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది.. మచ్చతెచ్చే విధంగా ఎవరూ వ్యవహరించవద్దు... పలుమార్లు ఎమ్మెల్యేలు, నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన హెచ్చరిక ఇది. అయితే ముఖ్యమంత్రి ఆదేశాలను పలువురు నాయకులు పెడచెవిన పెతుడున్నారు. ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. వివిధ మార్గాల్లో అక్రమాలకు తెర లేపుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు కాళంగి నది నుంచి ఇసుక తవ్వి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో పెద్ద ఎత్తున ఇసుక దందా సాగగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఇసుకను అక్రమంగా తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా కాళంగి నది తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. కాళంగి నుంచి గృహ అవసరాలకు అధికారుల అనుమతితో మాత్రమే ఇసుకను తీసుకోవాల్సి ఉంది. ఇతరత్రా అవసరాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌ల నుంచి మాత్రమే తీసుకోవాల్సి ఉంది. అయితే సూళ్లూరుపేట - తడ మధ్యలో ఉన్న కాళంగి రైల్వేబ్రిడ్జి వద్ద నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం వాటంబేడుకు వెళ్లే మార్గంలో రైల్వేట్రాక్ అంచున కాళంగిలోకి దారి ఏర్పరచుకొని రేయింబవళ్లు ఇసుకను తరలిస్తున్నారు. ఆదివారం ఒక్కసారిగా కాళంగిలోకి వరుసగా పదుల సంఖ్యలో ట్రాక్టర్ల వెళ్లడంతో సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాక్టర్లను పట్టుకొని వదిలేయడం గమనార్హం. ఇసుక మాఫియాకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో పోలీసులు పట్టుబడిన ట్రాక్టర్లను వదిలేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకొంటాం

కాళంగి నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్ నమోదు చేసి అనుమతి తీసుకోవాలి. కాళంగి రైల్వే బ్రిడ్జి వద్ద అక్రమ తవ్వకాలు నా దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకొంటాం.

- ఆర్డీవో కిరణ్మయి


గూడూరులోని రాజావీధిలో రద్దీ - జనాలతో కిక్కిరిసిన సూళ్లూరుపేట

పట్టణాల్లో పండుగ రద్దీ

గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలు సోమవారం నుంచి ప్రారంభం కానుడడంతో ఆదివారం గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి పట్టణాలు జనాలతో కిక్కిరిశాయి. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు వస్తువులను కొనుగోలు చేసేందుకు పట్టణానికి రావడంతో ఆదివారం గూడూరులో రద్దీ వాతావరణం నెలకొంది. భోగి, సంక్రాంతి పండుగకు దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు సమీప గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో పాతబస్టాండు, ఆస్పత్రి రోడ్డు, టవర్‌క్లాక్ సెంటర్, రాజావీధి, గాంధీబొమ్మ తదితర ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పండింది. ● సూళ్లూరుపేటలో సంక్రాంతి సంబరాలు ఆదివారమే ప్రారంభమయ్యాయి. పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో పట్టణమంతా కిక్కిరిసింది. బట్టలు షాపులు, పూజా సామగ్రి, ఫ్యాన్సీ షాపులన్నీ రద్దీగా కనిపించాయి. సుదూరు ప్రాంతాల్లో ఉండే బంధువులు, పిల్లలందరూ సొంత ఊళ్లకు పయనమవడంతో ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిక్కిరిసింది. ● నాయుడుపేట పట్టణం జనాలతో కిక్కిరిసింది. పండుగ సరుకులు, బట్టలు తదితర సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో దుకాణాలు కిటకిటలాడాయి. ● వెంకటగిరి పట్టణంలో సంక్రాంతి సందడి కనిపించింది. ప్రధాన వీధులన్నీ కిక్కిరిశాయి. ప్రజలు వస్త్రాలు విక్రయాలు కొనుగోలు చేశారు.


డివైడర్‌పై ఫ్లెమింగో పక్షుల ఆకారంలో మొక్కలు - అందమైన పూల మొక్కల ఏర్పాటు

గ్రీన్‌సిటీగా సూళ్లూరుపేట

సూళ్లూరుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణాన్ని గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారు. సంకాంత్రి, పక్షుల పండుగ నేపథ్యంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి చొరవతో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాలతో మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు పట్టణంలో హోలిక్రాస్ కూడలి నుంచి చెంగాళమ్మ ఆలయం వరకు డివైడర్ల నడుమ దాదాపు కిలో మీటరు మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనర్ చిన్నయ్య డివైడర్ల నడుమ పలు రకాల మొక్కలను దగ్గరుండి నాటించారు. ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు పక్షుల పండుగ జరగనున్న నేపథ్యంలో అక్కడక్కడ ఫ్లెమింగో పక్షులు, సంక్రాంతికి పొంగళ్లు పెట్టే పొంగలి కుండ తదితర ఆకారాలతో మొక్కలు, పలు రకాల పుష్పాలతో కూడిన అందమైన మొక్కలు నాటడంతో పట్టణంలో జీఎన్‌టీ రోడ్డు పచ్చదనంతో కళకళలాడుతోంది.


ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ వి.సునీల్, నటి గౌతమి - కార్యాలయ ప్రాంగణంలో పొంగళ్లు

అన్నాడీఎంకే కార్యాలయంలో
సంక్రాంతి సంబరాలు
ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆశీస్సులతో ఆ పార్టీ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 915 మంది పాల్గొనగా, 23 జట్లు రంగవల్లికల్లో ప్రతిభ కనబరిచి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆదివారం టి.నగర్‌లోని అన్నాడీఎంకే కార్యాలయంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నటి, అన్నాడీఎంకే ప్రచార విభాగం ఉప కార్యదర్శి గౌతమి తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఆర్.పద్మ - అర్చన, సంగీత - మహాలక్ష్మి, మైథిలి - మంజుల జంటలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో పార్టీ వైద్యవిభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ శరవణన్ ఆత్మీయ అతిథిగా పాల్గొని, నిర్వాహకులను, విజేతలను అభినందించారు. అన్నాడీఎంకే టి.నగర్ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి కె.సూర్యకళ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి పొంగల్ కానుకలు అందించారు. వేదిక ప్రాంగణంలో పొంగిన పొంగలిని స్వామి వారికి నివేదించారు. ఈ వేడుకల్లో హరిబాబు, పద్మనాభన్, తేన్‌మొళి, జయరాయన్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే కిలివేటితో సూళ్లూరుపేట వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులుగా నియమితులైన అనిల్‌రెడ్డి, కృపాకర్ రెడ్డి, పక్కన వైసీపీ నాయకుడు రామకృష్ణ తదితరులు - నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు మాధవరెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీకి నూతన సారథులు


వెంకటగిరి పట్టణ కన్వీనర్ ప్రసాదరెడ్డి, బాలాయపల్లి మండల అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి

సూళ్లూరుపేట, వెంకటగిరి టౌన్, బాలాయపల్లి, నాయుడుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం, పట్టణానికి నూతన సారథులను వైసీపీ నియమించింది. పార్టీ మండల అధ్యక్షు డిగా ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా వెల్లపాలెం కృపాకర్‌రెడ్డి నియమితులయ్యారు. వారిరువురూ ఆదివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు వైసీపీ నాయకులు మీజూరు రామకృష్ణారెడ్డి, బద్దెపూడి మోహన్ రెడ్డి, ఎస్‌కే హుస్సేన్ ఉన్నారు. అలాగే వెంకటగిరి పట్టణ కన్వీనర్‌గా పులి ప్రసాదరెడ్డి, బాలాయపల్లి మండల అధ్యక్షుడిగా వెందోటి కార్తీక్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా నాయుడుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడుగా కలికి మాధవరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం స్థానిక కేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మాధవరెడ్డిని వైసీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నాగార్జున, షబ్బీర్, నాయకులు కిషోర్‌యాదవ్, హరనాథ రెడ్డి, రాహుల్, చిట్టిబాబు, కృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలపై ప్రత్యేక దృష్టి

తహసీల్దారు ద్వారకనాథరెడ్డి



పెళ్లకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పెళ్లకూరు తహసీల్దారు ద్వారకనాథరెడ్డి తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకుస్తే క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

జవాబు: మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించాం. మొత్తం 203 అర్జీలు అందగా, వాటిలో 63 అక్కడిక్కడే పరిష్కరించాం. మిగిలిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం.

ప్రశ్న: ఎలాంటి సమస్యలపై అర్జీలు వచ్చాయి

జవాబు: ఎక్కువగా రీ సర్వేల్లో జరిగిన పొరపాట్లపై ఫిర్యాదులు అందాయి. సర్వే చేయాలని 26, పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగళ్, 1బీ కరెక్షన్ తదతర సమస్యలపై 177 అర్జీలు వచ్చాయి.

ప్రశ్న: ప్రభుత్వ భూముల పరిరక్షణకు తీసుకునే చర్యలు

జవాబు: మండలంలో ఏ గ్రామంలో ప్రభుత్వ భూమి ఎంత ఉందో వివరాలు సేకరిస్తున్నాం. ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయం



టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పండుగల్లో ఆటవిడుపుగా బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఈనెల 16,17,18 తేదీల్లో స్థానిక ఏఆర్‌డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరుగనున్నాయన్నారు. ఇందుకు సంబంధించి టీషర్టులను ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాల వద్ద ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే పలు శాఖల అధికారులకు, మీడియా ప్రతినిధులకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఈ పోటీలలో రెవెన్యూ, న్యాయవాదులు, వైద్యులు, మున్సిపల్, వాకర్లు, మీడియా జట్లతో పోటీలను నిర్వహించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, సురేష్, తూపిలి నాగేశ్వరరావు, నిమ్మకాయల రవి, సుబ్రమణ్యం, వేముల సునీల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కేజీ ప్రకృతికుమార్

వెంకటగిరిటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం ఏపీపీ ప్రకృతికుమార్ నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, శాలువాలు, స్వీట్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు క్యాలెండర్లు, చిన్నారులకు గిఫ్ట బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, గోపీనాథ్, రవింద్, హరీష్, రాజగోపాల్, ధనంజయ, రాంప్రసాద్, గురవయ్య, వడ్లమూడి, అభిరామ్, లక్ష్మణ్, నీలకంఠం, రాజాబాబు పాల్గొన్నారు.

వైభవంగా తాళమ్మ గ్రామోత్సవం



గూడూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు గ్రామదేవత తాళమ్మ గ్రామోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తాళమ్మ గ్రామోత్సవంతో పట్టణంలో భోగి పండుగ ప్రారంభమవుతుంది. ప్రతి ఏడాది భోగి పండుగ ముందు రోజు తాళమ్మ గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం భోగి పండుగ నేపథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, తప్పెట్లు, బాణసంచా పేలుళ్లు, యువత నృత్య ప్రదర్శనల నడుమ వైభవంగా గ్రామోత్సవం జరిపారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో పూజలు చేశారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కోటమ్మకు...

కోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారంలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.